# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | ఆదివారం 13-2-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 160 | పేజీలు: 4 | వెల: రూ.1/-


## బజాజ్ గ్రూప్ మాజీ ఛైర్మన్ , పారిశ్రామికవేత్త రాహుల్ బజాజ్ కన్నుమూత



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:బజాజ్ గ్రూప్ మాజీ ఛైర్మన్, పారిశ్రామికవేత్త రాహుల్ బజాజ్ కన్నుమూశారు. ఆయన వయసు 83సంవత్సరాలు. బజాజ్ ఆటోకు పర్యాయపదంగా ఉన్న ప్రముఖ పారిశ్రామికవేత్త రాహుల్ బజాజ్ పూణెలో మరణించారు. కాగా ఆయన నివాసంలో మరణించినట్టు ఆయన ఫ్యామిలీ సభ్యులు ట్వీట్ తెలిపారు. రాహుల్ బజాజ్ గతేడాది ఏప్రిల్‌లో బజాజ్ ఆటో ఛైర్మన్ పదవికి రాజీనామా చేశారు. భారతీయ కార్పొరేట్ ప్రకటన పరిశ్రమలో అత్యంత ప్రసిద్ధ ట్యాగ్‌లైన్‌లలో ఒకటి "మీరు కేవలం బజాజ్‌ను ఓడించలేరు" కంపెనీ ఐకానిక్ ద్విచక్ర వాహనం కోసం "హమారా బజాజ్". నేను చాలా బాధపడ్డాను అతను ప్రియమైన స్నేహితుడు , దేశం ఒక గొప్ప కొడుకును, దేశ నిర్మాతను కోల్పోయిందని ..ఓం శాంతి అని బయోకాన్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ ? ఆసియాలోని ప్రముఖ బయోఫార్మాస్యూటికల్స్ సంస్థ. ప్రపంచ ప్రభావశీలి , పద్మశ్రీ & పద్మభూషణ్‌లను గర్వించదగిన గ్రహీత కిరణ్ మజుందార్-షా ట్వీట్ చేశారు.

## రామానుజుల వారి దృక్పథమే ప్రపంచానికి ఏకైక దారి: మంత్రి ఎర్రబెల్లి



హైదరాబాద్, ఫిబ్రవరి 12:ముచ్చింతల్ లోని జీయర్ ట్రస్ట్ లో 1035 హోమగుండాల శ్రీలక్ష్మి నారాయణ మహా క్రతువు, గోపాలోపాయన పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ సమాన అవకాశాలు కలిగి, అందరిలోనూ సమ భావన కలిగి ఉన్నప్పుడే సమాజంలో ప్రజలకు సుఖ శాంతులు,సంతోషాలు కలుగుతాయని అన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా100 ఏళ్ల క్రితమే ప్రపంచానికి సమత ను చాటిన రామానుజుల వారి భారీ విగ్రహాన్ని ముచ్చింతల్ లో ప్రతిష్ఠించి, లోకానికి అంతా సమానం అనే విషయాన్ని చాటుతున్న శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి, అందుకు తోడుగా నిలిచిన మై హోమ్స్ అధినేత రామేశ్వర్ రావు గార్లు చరిత్రలో నిలిచి పోతారని మంత్రి అన్నారు.

ఎప్పటికైనా రామానుజుల వారి దృక్పథమే ప్రపంచానికి ఏకైక దారి అన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి పూర్ణాహుతి సంకల్పం తీసుకుని, స్వామి వారిని దర్శించుకున్నారు. అలాగే 1035 హోమగుండాల శ్రీ లక్ష్మీ నారాయణ మహా క్రతువులో పాల్గొన్నారు. జీయర్ స్వామి వారి గురువు గోపాలాచర్యుల వారి పేరున ఇచ్చే గోపాలోపాయన పురస్కార ప్రదానోత్సవం లో మంత్రి, తన సతీమణి, ఎర్రబెల్లి ట్రస్ట్ చైర్ పర్సన్ ఉషా దయాకర్ రావు, కుటుంబ సభ్యులతో పాటు పాల్గొన్నారు. గోపాలోపాయన పురస్కారాన్ని తమిళనాడుకు చెందిన మాడభూషి వరద రాజన్ కి అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు గారు మాట్లాడుతూ, దేవుడు అందరినీ సమానంగానే సృష్టించాడని, వారి వారి తెలివి, అవకాశాలను బట్టి ఎదుగుతున్నారు. కానీ అంతా సమానమేనని అన్నారు. సమతా మూర్తి విగ్రహ ప్రతిష్ఠ, రాష్ట్ర ప్రతిష్ఠను మరింత పెంచిందని, ప్రపంచ భక్తి పటంలో అంతర్జాతీయ సమతా క్షేత్రంగా, పర్యాటక ప్రాంతంగా ముచ్చింతల నిలిచిపోయిందని అన్నారు.

## జగపతి బాబుకు పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పిన మంత్రి ఎర్రబెల్లి

హైదరాబాద్, ఫిబ్రవరి 12: సీనియర్ సినిమా నటులు జగపతిబాబు పుట్టిన రోజు సందర్భంగా రాష్ట్ర పంచాయితీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆయన ఇంటికి వెళ్ళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ జగపతి బాబు హీరో గా, విలన్ గా, తన గొప్ప నటనతో సినీ ప్రేక్షకులతో అనుబంధాన్ని, అనేక మంది అభిమానులను సంపాదించుకున్నారు. ప్రత్యేకించి మహిళలు జగపతిబాబును బాగా అభిమానిస్తారు. ఆయన ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని అభిలషించారు. సుదీర్ఘంగా సినిమాల్లో నటిస్తూ మరింత గొప్ప పేరు తెచ్చుకోవాలి. ఆయనకు మరిన్ని అవార్డులు, రివార్డులు రావాలని ఆకాంక్షించారు. జగపతి బాబు తనకు చిరకాల మిత్రుడని మంత్రి పేర్కొన్నారు.

### 10 లక్షలతో పాటు అన్ని రంగాల్లో దళితులకు

## రిజర్వేషన్లు కల్పించడమే దళిత బంధు ఉద్దేశం: సీఎం కేసీఆర్

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 12: : తెలంగాణలో దళిత బంధు కార్యక్రమం అద్భుతమైనదని.. ఆ పథకం కింద దళితులకు కేవలం రూ.10 లక్షలు ఇవ్వడమే కాదు.. ఇదివరకు దళితులకు లేని ఎన్నో రిజర్వేషన్లను ఈ స్కీమ్ ద్వారా కల్పిస్తున్నామని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో సీఎం కేసీఆర్ ఇవాళ పర్యటిస్తున్నారు. ఈసందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడిన సీఎం కేసీఆర్.. ఇదివరకు దళితులకు రాని ఎన్నో ఫెసిలిటీలను ఇప్పుడు అందిస్తున్నామని తెలిపారు.

ప్రతి రంగంలో దళితులకు కూడా రిజర్వేషన్లు కల్పించడమే దళిత బంధు ముఖ్య ఉద్దేశం. విదేశీ విద్యలో కూడా పేద విద్యార్థులకు 20 లక్షలు ఇచ్చి వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్నాం. అద్భుతమైన పెట్టుబడులు వస్తున్నాయి. దేశం కిందికి పోతాఉంది. రాష్ట్రం మాత్రం అద్భుతంగా పురోగమిస్తోంది. ఉద్యోగులకు సంబంధించి చిన్నాచితక సమస్యలు వస్తాయి. అవి కామన్. 69లో జరిగింది ముల్కీ రూల్స్ పోరాటమే. కేంద్ర ప్రభుత్వం ఏడిపించినా.. 95 శాతం రిజర్వేషన్లు లోకల్స్ కోసమే కేంద్రం నుంచి కొట్లాడి తీసుకొచ్చా. 95 శాతం ప్రభుత్వ ఉద్యోగాలు తెలంగాణ బిడ్డలకే. గెజిటల్ పోస్టులు కూడా మల్టీ జోనల్ పోస్టులుగా తీసుకొచ్చాం. అవి కూడా 95 శాతం తెలంగాణ బిడ్డలకే వస్తాయి. ఇవి తెలియక కొందరు పిచ్చిగా మాట్లాడుతున్నారు. తెలంగాణలో పరిశుభ్రమైన వాతావరణం ఉండాలి. ఉద్యోగుల సర్వీస్ రూల్స్ మారాలి. ఉద్యోగ సంఘాల నాయకులను కోరేది కూడా అదే. సర్వీస్ నిబంధనలు సరళీకరించాలి. రిటైర్ అయ్యేనాటికి సర్వీస్ రూల్స్ సులభంగా ఉండాలి.. అని సీఎం కేసీఆర్ వెల్లడించారు.

**భువనగిరి జిల్లా అవుతుందని ఎవరూ ఊహించలే : సీఎం కేసీఆర్**

. భువనగిరి జిల్లా ఏర్పాటు చేసుకొని, అద్భుతమైన జిల్లా కలెక్టరేట్‌కు ప్రారంభించింకున్నందుకు జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కలెక్టర్‌ను అభినందిస్తున్నాను. ఎప్పుడు ఎవరూ ఊహించిన మాట కాదు. భువనగిరి జిల్లా అయిదని కలలో ఎవరూ అనుకున్న మాట కాదు. అందరికీ అన్ని విషయాలు అర్థం కావు.

ఆ కారణం వల్ల గతంలో యావత్ భారత్‌దేశంలో అన్ని రాష్ట్రాలు కొత్త జిల్లాలు ఏర్పాటు చేసుకున్నా.. కేవలం ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్ కొత్త జిల్లాలు ఏర్పాటు చేయలేదు. గతంలో కొందరు కోరినా చేయలేకపోయారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో స్వయంగా మంచిర్యాల జిల్లా ఏర్పాటు చేస్తానని చెప్పారు. కారణం ఏదైనా ఆయన సైతం చేయలేకపోయారు. అనేక రకాల అపోహలు, సరైన పద్ధతిలో కుదరకపోవడంతో సాధ్యం కాలేదు. జిల్లాల ఏర్పాటు ప్రక్రియ ఏర్పాటు చేయాలనుకున్నప్పుడు సంప్రదించి మొదటి వ్యక్తి ఛత్తీస్‌గఢ్ చీఫ్ అడ్వైజర్.

తెలంగాణ రాష్ట్రం కావాలని ఉద్యమం చేసిన సందర్భంలో నేను ఆయనను డజన్ సార్లు కలవడం జరిగింది. చాలా మందికి అపనమ్మకం, ఆత్మవిశ్వాసం లేకపోవడంతో ఏమో కొట్లాడుతున్నరు గానీ తెలంగాణ అయితదా అని చాలా మంది సంశయజీవులే పెద్ద సంఖ్యలో ఉండిరి. మాకు సంపూర్ణ నమ్మకం ఉండే.. ఈ సారి తెలంగాణ వందకు వందశాతం వస్తదని. ఛత్తీస్‌గఢ్ అడ్వైజర్‌ను ఛత్తీస్‌గఢ్ మధ్యప్రదేశ్ నుంచి విడిపోయిన రాష్ట్రం కదా.. ఏం చేశారని, ఏం స్టెప్స్ తీసుకున్నరని అడిగి తెలుసుకున్నాం. ఛత్తీస్‌గఢ్‌లో బస్తర్ జిల్లా ఉండేదని, దానిపై పెద్ద జోక్స్ ఉండేవి. బస్తర్ జిల్లా కేరళ రాష్ట్రం కంటే పెద్దగా ఉంటదని జోక్స్ ఉండేవి. ఇప్పుడు దాన్ని నాలుగైదు జిల్లాలు చేశారు. అందులో ప్రధాన పాత్ర వహించింది ఛత్తీస్‌గఢ్ అడ్వైజర్.

వారిని అడిగాం అరౌండ్ పది లక్షలు, 10-12 లక్షలు ఉంటే ఈజీ, కొన్ని సందర్భాలు, ప్రత్యేక పరిస్థితుల్లో 5లక్షల పాపులేషన్ ఉన్నా ఆయన గోహెడ్ అని చెప్పారు. భోనగిరి ర్యాపిడ్‌గా వేగంగా డెవలప్ అయ్యే ప్రాంతం. యాదాద్రి టెంపుల్ అభివృద్ధి అయిపోతే.. అనూహ్యంగా అభివృద్ధి చెందుతుంది. బీబీనగర్, భువనగిరి, ఘట్కేసర్, హైదరాబాద్ అంతా కలిసిపోయి కారిడర్‌గా ఉంటది. తాను కలగనే కారిడార్ వరంగల్ ? హైదరాబాద్ అద్భుతమైన కారిడార్ అవుతుంది. వాటి మధ్యలో వచ్చేవన్నీ గ్రోత్ సెంటర్స్ అవుతాయ్. భువనగిరి, జనగామ, హనుమకొండ, వరంగల్, మేడల్చ్ జిల్లా కేంద్రాలు కావడం ద్వారా వచ్చేటువంటి గ్రోత్.. అందరు సామాన్యులకు అర్థం కాదు.

భువనగిరి, యాదాద్రిలో భూముల ధరలు ఎట్ల ఉన్నయ్.. ఒకప్పుడు ఎట్ల ఉండే. గుట్టపొంటి సైతం కోట్లే. మారుమూల గ్రామాలకు పోతే 25-30లక్షల్లోపు ఎకరం భూమి దొరికే పరిస్థితి లేదు. మహబూబ్‌నగర్ జిల్లాలో మాగనూర్ మండల కేంద్రంలో అక్కడ భూమి ఎవరు అడగపోతేది. అక్కడ సైతం రూ.25లక్షల ఎకరంకు తక్కువ లేదు. తెలంగాణ శివారులోని కర్ణాటకలో రూ.4లక్షలు, రూ.5లక్షలు ఉంటే.. మన ప్రాంతంలో రూ.25లక్షలకు తక్కువ లేదని ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి చెప్పిండు. మారు మూల ప్రాంతాల్లోని ఆదిలాబాద్ అడవి జిల్లా, అచ్చంపేట, నారాయణపేట జిల్లాలో భూముల ధరలు పెరిగాయన్నారు. కార్యక్రమంలో మంత్రులు జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దేశంలో 172.29 కోట్ల కోవిడ్ వ్యాక్సిన్ డోసుల పంపిణీ

హైదరాబాద్, ఫిబ్రవరి 12: దేశంలో కోవిడ్ వ్యాప్తి నిర్మూలనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగానే ప్రతి ఒక్కరికీ వ్యాక్సిన్ పంపిణీ చేస్తోంది. ఇప్పటి వరకూ దేశ వ్యాప్తంగా 172.82 కోట్ల వ్యాక్సిన్ డోసులను పంపిణీ చేసినట్టు కేంద్ర ఆరోగ్యశాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలో గడిచిన 24గంటల్లో 46.82 లక్షల వ్యాక్సిన్ డోసులను పంపిణీ చేసినట్టు అధికారులు తెలిపారు. కాగా దేశంలో రికవరీ రేట్ 97.37 శాతం కాగా గడిచిన 24 గంటల్లో కొత్తగా 50,407 కేసులు నమోదయ్యాయి. యాక్టివ్ కేసుల సంఖ్య 6,10,443 కాగా వీక్లీ పాజిటివిటీ రేట్ 5.07 శాతంగా అధికారులు పేర్కొన్నారు.

## అధికారులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నా : సీఎం కేసీఆర్

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 12:యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన నవీకృత కలెక్టరేట్‌ను ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం మాట్లాడారు. ఈ సందర్భంగా అధికారులు చేసిన కృషిని అభినందించారు. ఇంకా ఆయన మాట్లాడుతూ.. గతంలో శాసనసభ్యుడిగా ఉన్న సమయంలో శాసనసభ కమిటీ చైర్మన్‌గా ఉన్నా. టూర్ పోవాలంటూ రెండు మూడు రాష్ట్రాలు తిరిగి ముంబైకి వెళ్లాం. అక్కడ బస్సులో ఒక లేడీ గైడ్‌గా వచ్చింది.

ఆమెను ఏం చేస్తవ్ అని అడిగితే సార్.. నా భర్త చనిపోయిండు. ఇద్దరు పిల్లలు ఉన్నరు.. ఈ గైడ్‌గా పని చేసుకుంటూ సంతోషంగా ఉన్నా అని చెప్పింది. మరి ఎక్కడుంటవ్ ముంబైలో అని అడిగితే బాంద్రాలో ఉంటా అని చెప్పింది.

ఫ్లాట్ ధర ఎంత ఉంటుంది అని అడిగితే రూ.3కోట్లు ఉంటదని అని చెప్పింది. 1986-87 ప్రాంతంలో చెప్పింది. ఆ సమయంలో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతంలో రూ.30లక్షలకే బ్రహ్మాండమైన ఇళ్లు దొరికేది.

ఆమెకు నీ ఫ్లాట్ అమ్ముకొని హైదరాబాద్‌కు రావాలని చెప్పానని, ఇందుకు ఆమె రానని చెప్పింది. ఎందుకు రావు అని అడిగితే సార్.. మీదగ్గర మంచినీళ్లు సరిగా దొరికాయ్.. మీ దగ్గర కరెంటు ఎప్పుడు వస్తదో.. ఎప్పుడు పోతదో తెల్వది.. అలాంటి దగ్గరికి ఎవరస్తరు అని అన్నది. బయట మనగురించి సానుకూల దృక్పథం, సానుకూల వాతావరణం ప్రబలి ఉంటే అందరు వస్తరు.. ఈ రోజు హైదరాబాద్‌లో చీఫ్ సెక్రెటరీ నాయకత్వంలో ప్రభుత్వ అధికారులు, మంత్రవర్గంతో పాటు అద్భుతంగా కృషి చేశారు. మీ అధికారులందరికీ శిరస్సు వంచి నమస్కారం చేస్తున్నా. అద్భుతమైన కృషి, అద్భుతమైన టార్గెట్స్ ఎవరూ కలలో ఊహించలే.

సాధించిన ప్రగతి చెబితే వేరే రాష్ట్రాల వాళ్లు వచ్చిన సందర్భంలో చెబితే చెక్కరచ్చి పడిపోయే పరిస్థితి ఉన్నది. వ్యవసాయ రంగం అద్భుతం కావాలి, స్థిరీకరణ జరగాలి, సాగుకు నీళ్లు రావాలి, భూగర్భ జలాలు పెరగాలి. వంటిగనే నోట్లెకెలి చెబితే తమాషా అనుపిస్తుంది. భూగర్భ జలాలు తెలంగాణలో అట్టిగనే పెరిగినయా?.. 800, 900 ఫీట్ల దాకా బోర్లు వేసిన బోనగిరి, ఆలేరు, తుర్కపల్లిలో, రాజాపేటలో ఇవాళ 20, 10 ఫీట్లకే నీళ్లు యాడికెలి వచ్చినయ్. దాని వెనుక ఎంత అంకితభావంగా.. ఎన్నో డిపార్టుమెంట్ల కృషి ఉన్నది. మొత్తం వ్యవసాయ భూములను 2601 క్లస్టర్లుగా విభజించి, ప్రతి క్లస్టర్‌కు అధికారిని పెట్టి.. ఒక రైతు వేదిక కట్టి.. మొత్తం మిషన్ కాకతీయలో చెరువులన్నింటిని అభివృద్ధి వాగుల్లో చెక్ డ్యామ్‌లు కట్టి అద్భుతంగా చేశాం. వాటర్ షెడ్డింగ్ అంటే నీళ్లను పరుగెత్తకుండా.. నడిపించాలే అది వాటర్ షెడ్.

అది కాకతీయులరాజుల పుణ్యమాని తెలంగాణకు 11వ శతాబ్దంలో నేర్పారు. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో నష్టపోయాం. ఇప్పుడు కాళేశ్వరం నుంచో, దేవాదుల నుంచే ఇంకో చోటు నుంచి నీళ్లు తెచ్చి ప్రాజెక్టులు, చెరువులు నింపుకుంటున్నం. మళ్లీ అక్కడ వర్షపాతం పడితే నీళ్లు ఒర్రెలు, వాగులు, నదుల నుంచి సముద్రంలోకి వెళ్లకుండా ప్రతి వాగులపై చెక్‌డ్యామ్‌లు కట్టుకున్నం. ఆలేరు వాగు వద్ద, జనగామ యశ్వంతాపూర్ వద్ద చెక్‌డ్యామ్‌లు బ్రహ్మాండంగా కనిపిస్తున్నయ్. ఈ విధంగా అర్థంచేసుకొని ప్లాన్ చేస్తే 24 గంటల కరెంటు ఉంటంది. మిషన్ కాకతీయలో చెరువులు నిండుతున్నయ్. 1985లో ఎమ్మెల్యేగా గెలిచిన. సమైక్య రాష్ట్రంలో 20 ఏళ్లు ఎమ్మెల్యేగా ఉన్న.

ఉద్యమం చేసిన సమయంలో ఎంపీ పదవిలో ఉన్నా. కాలం కానే కాదు తెలంగాణలో.. ఖర్మం బాగుండి కాలం అయిందనుకో ఒక్కొక్క సంవత్సరం చెరువులు నిండి మత్తడులు దుంకితే పదివేల, 20వేల చెరువులు పటాకులు తెగినట్లే తెగు. స్టోరీజి కెపాజిటీ లేకపోవడంతో చెరువులు తెగిపోతయ్.

మీకు జ్ఞాపకం ఉంటది.. నల్లగొండ జిల్లాలో చెరువు కట్ట తెగితే రైలు కొట్టకుపోతదా?.. నేను రోజు ఉద్యమంలో ఉన్నాం. మిషన్ కాకతీయ ఉంటే వర్డ్ అంటే గమ్మతిగా కనబడతది.. దానివెనుకున్న లోతు, అధ్యయనం ఇది. సమైక్య రాష్ట్రంలో నాశనమైన చెరువులను ఓ మిషన్ కిందపెట్టి.. కాకతీయ రెడ్డిరాజులే పుణ్యంకట్టుకొని మనకు అన్నం పెట్టిన్రు కాబట్టి.. వాళ్ల పేరు పెడితేనే బర్కతి ఉంటదని మిషన్ కాకతీయ పేరు పెట్టామన్నారు.

## ప్రెసిడెన్షియల్ సూట్‌ను ప్రారంభించిన సీఎం కేసీఆర్

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 12:సీఎం కేసీఆర్ యాదాద్రిలో పర్యటిస్తున్నారు. వీఐపీల విడిది కోసం నూతనంగా నిర్మించిన ప్రెసిడెన్షియల్ సూట్, విల్లాలను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ప్రెసిడెన్షియల్ సూట్‌ను అత్యాధునిక సదుపాయాలతో 1500 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించారు. ఆలయాన్ని తిలకించేందుకు ప్రత్యేకమైన వ్యూపాయింట్‌ను ఏర్పాటు చేశారు. చిన్న కొండపై 14 విల్లాలు, ఒక మెయిన్ సూట్‌ను నిర్మించారు. 13.25 ఎకరాల్లో సూట్ల నిర్మాణం జరిగింది.

ప్రెసిడెన్షియల్ సూట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, జగదీశ్ రెడ్డి, ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎమ్మెల్యే గొంగిడి సునీత తదితరులు పాల్గొన్నారు.

అనంతరం భువనగిరిలో కొత్తగా నిర్మించిన అధునాతన సమీకృత కలెక్టరేట్ సముదాయాన్ని సీఎం కేసీఆర్ ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 3:15 గంటలకు టీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయానికి చేరుకొని నూతన భవనాన్ని ప్రారంభిస్తారు. అక్కడి నుంచి 4 గంటలకు రాయగిరిలోని బహిరంగ సభలో పాల్గొంటారు.

## కంటోన్మెంట్ నియోజక వర్గాన్ని అభివృద్ధి చేస్తున్నాం: కేటీఆర్



హైదరాబాద్, ఫిబ్రవరి 12: సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజక వర్గాన్ని టీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్నదని మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. కానీ కంటోన్మెంట్ అభివృద్ధిని కేంద్రం అడ్డుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసి పరిధిలోని ప్రాంతాలతో పాటు కంటోన్మెంట్‌లోనూ ఉచిత మంచినీటి పథకం అమలు చేస్తున్నామని మంత్రి కేటీఆర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కంటోన్మెంటును అభివృద్ధి చేస్తుంటే కేంద్రం అడ్డుకుంటున్నదని అన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గంలోని రసూల్‌పురాలో నాలా అభివృద్ధి పనులకు, పాటిగడ్డలో మోడ్రన్ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌కు మంత్రి శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు.

అనంతరం మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం పేదలకు పట్టాలు ఇవ్వడంలేదని చెప్పారు. రోడ్లు వేస్తామంటే స్థలం ఇవ్వడం లేదని విమర్శించారు. కంటోన్మెంట్‌లో రోడ్లను మూసేయడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో హైదరాబాద్ అభివృద్ధి చెందుతున్నదని వెల్లడించారు. నగరంలో ప్రశాంత వాతావరణం ఉన్నదని తెలిపారు. కుల మతాలతో సంబంధం లేకుండా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కోసం పది లక్షల మంది ఆగబిడ్డలకోసం రూ.8421 కోట్లు ప్రభుత్వం వెచ్చించిందన్నారు.

## మేడారం సమ్మక్క సారక్క జాతర డాక్యుమెంటరీ విడుదల చేసిన ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్, ఫిబ్రవరి 12: తెలంగాణ కళాకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత. హైదరాబాద్ లోని నివాసంలో మేడారం సమ్మక్క సారక్క జాతర డాక్యుమెంటరీని ఎమ్మెల్సీ కవిత విడుదల చేశారు. అనంతరం పద్మశ్రీ అవార్డు గ్రహీత సకిని రామచంద్రయ్య ని ఘనంగా సత్కరించారు. అంతరించిపోతున్న కళను బతికించడానికి రామచంద్రయ్య చేస్తున్న కృషి మరువలేనిదని ఎమ్మెల్సీ కవిత కొనియాడారు. సమ్మక్క సారక్క జాతరలో రామచంద్రయ్యకు ఓ ప్రత్యేక గుర్తింపు ఉంది. ఆ వనదేవతలకు ఆయన డోలు వాయిద్యం వాయిస్తూ పూజలు నిర్వహిస్తారు.

ఈసారి కూడా జాతరలో ఆయన డోలు మోగనుంది. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన ఆదివాసీ జాతర మేడారం సమ్మక్క సారక్క జాతరపై ప్రత్యేక డాక్యుమెంటరీ రూపొందించిన ఫిల్మ్ మేకర్ బాలాజీ దూసరిని ఎమ్మెల్సీ కవిత అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం కళాకారులను ప్రోత్సహించడానికి అన్ని విధాలుగా సహకారం అందిస్తోందని సకినా రామచంద్రయ్య గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, పినపాక ఎంఎల్ఏ రేగా కాంతారావు సైతం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి జనరల్ సెక్రటరీ నవీన్ ఆచారి , ఉపాధ్యక్షులు మేడే రాజీవ్ సాగర్ , సాంస్కృతిక విభాగం కన్వీనర్ కోదారి శ్రీను , తెలంగాణ జాగృతి రంగారెడ్డిఅధ్యక్షురాలు అర్చన , మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సంతోష్ పాల్గొన్నారు.

## తమిళనాడులో 16 నుంచి పాఠశాలల పునఃప్రారంభం

చెన్నై, ఫిబ్రవరి 12:: తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కోవిడ్ కేసులు తగ్గడంతో పాఠశా లలను తిరిగి ప్రారంభించాలని నిర్ణయించినట్లు ప్రభుత్వం పేర్కొంది.

ఫిబ్రవరి 16వ తేదీ నుంచి ఎల్‌కేజీ, యూకేజీ విభాగాలతో ప్లేస్కూల్స్ మరియు నర్సరీ పాఠశాలలను తిరిగి తెరవడానికి తమిళనాడు ప్రభుత్వం అనుమతించింది. పెళ్లిళ్లకు 200 మంది హాజరుకావచ్చని ప్రభుత్వం పేర్కొంది. ఇతర కార్యక్రమాలు, అంత్యక్రియలకు 100 మంది మాత్రమే హాజరుకావాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## నిపుణుల సిఫార్సు తర్వాతే 5 నుంచి 15 సంవత్సరాల వారికి టీకా : మన్సుఖ్ మాండవీయ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:ఐదేళ్ల నుంచి పదిహేను ఏళ్ల పిల్లలకు కోవిడ్ టీకా ఇచ్చే విషయంలో నిపుణులు ఇంకా ఎలాంటి సిఫార్సు చేయలేదని కేంద్ర కుటుంబ, ఆరోగ్య మంత్రి మన్సుఖ్ మాండవీయ అన్నారు. నిపుణుల సిఫార్సులు రావడమే ఆలస్యం.. ఐదేళ్ల నుంచి పదిహేను ఏళ్ల వయస్సున్న పిల్లలకు కూడా వ్యాక్సినేషన్ ప్రారంభిస్తామని మాండవీయ ప్రకటించారు. గుజరాత్ గాంధీనగర్‌లో మంత్రి మన్సుఖ్ మాండవీయ విలేకరులతో మాట్లాడారు. ఏఏ వయస్సుల్లో ఉన్న వారికి కోవిడ్ టీకా ఇవ్వాలన్నది నిపుణుల సలహాలు, సిఫార్సుల పైనే ఆధారపడి ఉంటుందని స్పష్టం చేశారు.

ఇక 15 నుంచి 18 సంవత్సరాలున్న యువకులకు కోవిడ్ వ్యాక్సినేషన్ ప్రారంభించామని, 5 ఏళ్ల నుంచి 15 సంవత్సరాల వయస్సున్న వారి విషయంలో నిపుణుల సిఫార్సులు రాగానే టీకాను వేయడం ప్రారంభిస్తామని అన్నారు. అయితే కొన్ని నెలల క్రితం చేసిన ఓ సర్వేలో దాదాపు 67 శాతం మంది పిల్లల్లో వ్యాధినిరోధక శక్తి పెరిగిందని, వ్యాధి లక్షణాలు కూడా లేవని తేలిందని మంత్రి మాండవీయ తెలిపారు.

## ఏపీలో కొవిడ్ కేసులు తగ్గుముఖం

అమరావతి, ఫిబ్రవరి 12: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మహమ్మారి కొవిడ్ కేసులు క్రమంగా తగ్గిపోతున్నాయి. రాష్ట్రంలో శుక్రవారం 1166 కేసులు రాగా.. గత 24 గంటల్లో 800 కేసులు మాత్రమే నమోదయ్యాయి. తాజాగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్య శాఖ హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. దీని ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా గడిచిన 24 గంటలకలె కొత్తగా 896 కరోనా కేసులు నమోదయ్యాయి. దీంతో ఆంధ్ర ప్రదేశ్‌లో మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 2312029 కు చేరాయి. గత 24 గంటల్లో 24, 066 శాంపిల్లను పరీక్షించగా.. 896 మందికి పాజిటివ్‌గా తేలింది. ఇదే సమయంలో కొవిడ్ కారణంగా ఆరుగురు చనిపోయారు.




### చరిత్రలో నేటినిజం



కం॥ టెన్నీసునుబున ప్రాణ
మ్మున్నంతటి వరకు ఆగుల మోదము తూడిదన్
త్రిన్నగ "సోం దేవ్ రామన్"
వన్నెగ ప్రేయించ మంచి ప్రఖ్యాతి గానుమే !!

( ఫిబ్రవరి 13 టెన్నిస్ క్రీడాకారుడు సోమ్‌దేవ్ దేవ్‌రామన్ పుట్టిన రోజు...)



-రాధశ్రీ

సెల్: 9494481210

## ధర్మపురిలో మహా సుదర్శన యాగం - పాల్గొన్న మంత్రి కొప్పుల దంపతులు

హైదరాబాద్, ఫిబ్రవరి 12:ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో మహా సుదర్శన యాగం కన్నులపండువగా నిర్వహించారు. భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య సుదర్శన యాగం అత్యంత వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రివర్యులు కొప్పుల ఈశ్వర్ దంపతులు సుదర్శన యాగం లో పాల్గొన్నారు. అనంతరం లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్నారు. సుదర్శన యాగంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

## పీఎస్ఎల్వీ-సి52 ప్రయోగానికి గ్రీన్‌సిగ్నల్

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 12::: పీఎస్ఎల్వీ-సీ52 రాకెట్ రోదసీ యానాకి గ్రీన్‌సిగ్నల్ పడింది. సోమవారం ఉదయం 5.59 గంటలకు ఈ రాకెట్‌ను ప్రయోగించేందుకు లాంచ్ ఆథరైజేషన్ అంగీకారం తెలిపింది. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం (షార్)లోని ప్రథమ ప్రయోగ వేదిక నుంచి రాకెట్ నింగిలోకి దూసుకుపోనుంది. ఈ ప్రయోగ సన్నహాలలో భాగంగా శనివారం మధ్యాహ్నం షార్‌లో జరిగిన మిషన్ రెడీనెస్ రివ్యూ (ఎంఆర్ఆర్) సమావేశంలో ఇస్రో నూతన చీఫ్ ఎస్ సోమ నాథ్ పాల్గొన్నారు. సాయంత్రం లాంచ్ ఆథరైజేషన్ బోర్డు సమావేశమై ప్రయోగానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఆదివారం తెల్లవారుజామున 4:29 గంటలకు కౌంట్‌డౌన్‌ను ప్రారంభించేందుకు సన్నహాలు చేస్తున్నారు. 25.30 గంటల పాటు కౌంట్ డౌన్ కొనసాగించి, సోమవా రం ఉదయం 5.59 గంటలకు పీఎస్ఎ ల్వీ-సి52 రాకెట్ రోదసీలోకి దూసుకుపోనుంది.

# డబ్బులతో జబ్బులు- కరెన్సీ కాలుష్యము

ఆదిమానవుడు తనకు అవసరమైన సరుకులు పొందడానికి "వస్తు మార్పిడి" పద్ధతి ద్వారా సమకూర్చుకునే వాడు. కాలక్రమంలో నరుడు తన సౌలభ్యం కోసమంటూ కొన్ని వేల సంవత్సరాలుగా కరెన్సీ నోట్లు, నాణాలను ప్రవేశపెట్టి వ్యాపార లావాదేవీలు కొనసాగిస్తున్నాడు. మానవుడి జీవితంలో కరెన్సీ అతి ప్రధాన భాగమైంది. అనునిత్యం కరెన్సీని తప్పక వాడే పరిస్థితి వచ్చింది. ప్రతి రోజు కరెన్సీ చేతులు మారడం అనివార్యమైంది. ప్రపంచ దేశాల్లో అన్ని వర్గాల ప్రజలు కరెన్సీ నోట్లను, నాణాలను తమ తమ స్థాయిలను బట్టి వినియోగిస్తున్నారు. అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలన్నింటిలో కరెన్సీ కాలుష్యము పెనుప్రమాదంగా మారుతోంది. ముఖ్యంగా అధిక జనాభాగల ఇండియాతో పాటు ఇతర పేద దేశాల్లో దీని ప్రతికూల ప్రభావం ఎక్కువగా ఉంది.

కరెన్సీ నోట్లను పేపర్, కాటన్ లేదా ప్లాస్టిక్‌లతో తయారుచేస్తున్నారు. నాణాలు మాత్రం మిశ్రమ లోహాలతో తయారవుతాయి. కరెన్సీ వివిధ వర్గాల ప్రజల చేతులు మారినపుడు ఒకరి నుండి మరొకరికి వ్యాధికారక సూక్ష్మజీవులు చేరే ప్రమాదం ఎదురవుతోంది. అపరిశుభ్ర వాతావరణం, చేపల మార్కెట్, మటన్ చికెన్ మార్కెట్, దుమ్ము ధూళిలో పనిచేసే వారు, రోడ్ల వెంట అమ్మకాలు జరిపే దుకాణాదారులు, ఆసుపత్రి పరిసరాలు, మునిసిపాలిటీ కార్మికులు మె?దలగు వారి చేతుల మీదుగా కరెన్సీ మారితే, హానికారక సూక్ష్మజీవులు వ్యాపించి అనేక అనారోగ్యాలకు కారణం కావచ్చనే వాస్తవం విస్మయాన్ని కలుగచేస్తోంది. సూక్ష్మజీవులతో కరెన్సీ కలుషితం కావటానికి కారణాలుగా దగ్గులు, తుమ్ములు, లాలాజలంతో నోట్ల లెక్కింపు, అపరిశుభ్ర ప్రదేశాల్లో పెట్టడం, అనేక రోజులు దాచి ఉంచటం, అవగాహనాలోపం లాంటి అంశాలను చెప్పవచ్చు. అపరిశుభ్రత, గాలిలో తేమ, ఉష్ణోగ్రత, అతినీలలోహిత కిరణాలు, గాలి నాణ్యత, సూక్ష్మజీవులు జీవించే కాలం లాంటివి కూడా కరెన్సీ కాలుష్యాన్ని ప్రభావితం చేస్తాయి. కొన్ని సూక్ష్మజీవులు అతిశీతల, అతి ఉష్ణోగ్రతలను కూడా తట్టుకొనుటతో సమస్య తీవ్రత రెట్టింపు అవుతున్నది.

కరెన్సీ కాలుష్యానికి కారణమైన సూక్ష్మజీవుల్లో వ్యాధికారక బ్యాక్టీరియా, వైరస్, ఫంగి, ఈస్ట్ మె?దలగు పరాన్నజీవులు, కొన్ని రసాయనాలు వస్తాయి. కాటన్, పేపర్ కరెన్సీ, నాణాల ద్వారా ఈ కాలుష్య వ్యాప్తి మరింత ఎక్కువగా ఉంటుంది. తక్కువ విలువగల నోట్లు, నాణాల (5-,10-, 20-, 50-, 100-) వాడకం అధికంగా ఉండటం వల్ల కరెన్సీ కాలుష్యం వేగంగా వ్యాపిస్తుంది. మార్కెట్‌లో తిరుగుతున్న కరెన్సీలో 60 నుండి దాదాపు 100 శాతం కాలుష్యానికి గురికావటం సమస్య తీవ్రతను తెలియజేస్తోంది. వివిధ దేశాలలో జరుగుతున్న పరిశోధనల ఫలితాలను బట్టి దాదాపు 93 రకాలైన వ్యాధికారక సూక్ష్మజీవులు కరెన్సీ ద్వారా వ్యాపిస్తున్నాయని విదితమయ్యింది. భోపాల్ నగరంలో జరిగిన పరిశోధనల్లో 94% కరెన్సీ కలుషితమైందని రుజువైంది. కరెన్సీలోని ఈ సూక్ష్మజీవులు కొన్ని గంటలు, రోజులు, నెలలు జీవిస్తున్నందున మన ఆరోగ్యం ప్రమాదంలో చిక్కుకోబోతున్నది.

ముఖ్యమైన వ్యాధికారక బ్యాక్టీరియాలో ఎంటెరోబాక్ఇటీరియేసీ, వైబ్రోకలరో, బాసిల్లస్ యస్‌పి, స్టఫైలోకోకస్ యస్‌పి, మైకోబాక్టీరియమ్ ట్యుబర్క్యులోసిస్, మైక్రోకోకస్ యస్‌పి, కొరినెబాక్టీరియమ్ యస్‌పి, స్ట్రెప్టోకోకస్ యస్‌పిపి, ఎస్‌చెరిసియా కోలి, క్లిబ్సియెల్లా యస్‌పిపి, సూడోమెనాస్ ఆరుజినోసా, సాల్మెనెల్లా కలరోసిస్, యస్. ఆరెస్ లాంటివి వస్తాయి. వ్యాధికారక వైరస్‌లలో కరోనా, కాగ్సాకీ, ఇన్ఫ్లుయెంజా, రీనో, అస్ట్రో, హెచ్ఏవి, పోలియో, రోటా, హెర్పస్ వైరస్ లాంటివి గుర్తించబడినవి.

ఈ వ్యాధికారక సూక్ష్మ జీవుల వ్యాప్తితో జ్వరం, ఫుడ్ పాయిజన్, మూత్ర, జీర్ణనాళ, శ్వాసకోశ, చర్మ వ్యాధులు వస్తాయి. విరోచనాలు, వాంతులు, న్యూసియా సర్వసాధారణంగా కనిపిస్తాయి. న్యుమోనియా, ఇమ్యూన్ వ్యవస్థపై ప్రభావం గమనించబడింది. వీటిలో కొన్ని సూక్ష్మజీవులు అంటిబయాటిక్ మందులకు కూడా లొంగకుండా నిరోధకతను కలిగి ఉన్నాయి.

కరెన్సీ కాలుష్యాన్ని తగ్గించుటకు అనేక చర్యలు తీసుకోవల్సిన సమయం ఆసన్నమైందని గమనించాలి. కరెన్సీ వాడకాన్ని తగ్గించి ఆన్‌లైన్‌లో లేదా ఏటీఎం కార్డులు వాడుతూ నగదు బదిలీ చేయడాన్ని ప్రోత్సహించాలి. పాత కరెన్సీని దఫాల వారీగా శుభ్రపరచాలి (బబివతీతిశ్రీతిబజీబితినీని). అతిపాత నోట్లను మార్కెట్ నుండి తొలగించాలి. కాటన్, పేపర్ నోట్లకు బదులుగా ప్లాస్టిక్ కరెన్సీని ప్రవేశపెట్టాలి. ఉగ్రవాదులు కరెన్సీని కలుషితం చేసే అవకాశాన్ని తోసిపుచ్చరాదు. కరెన్సీ ముట్టుకున్న ప్రతిసారి చేతులను సబ్బుతో శుభ్రపరచు కోవాలి. నోట్లు లెక్కించినపుడు ఉమ్మి వాడరాదు. షూ, సాక్స్, కార్పెట్ లాంటి అపరిశుభ్ర ప్రదేశాల్లో కరెన్సీని దాయరాదు. నాణాలు లేదా నోట్లను నోట్లో పెట్టుకొనుట అతి ప్రమాదకరం. పిల్లలను కరెన్సీకి దూరంగా ఉంచాలి.

అధిక జనాభా, పేదరికం, నిరక్షరాస్యత ఎక్కువగా ఉన్న మన దేశంలో కరెన్సీ కాలుష్యం మరో ప్రమాదంగా మారక పూర్వమే మేల్కొని తగు చర్యలు తీసుకుంటూ అభివృద్ధి పథంలో పయనించేందుకు అందరిలో అవగాహన కలిగిస్తూ ముందుకు సాగుదాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## దామోదరం సంజీవయ్య పేరు పెట్టాలని కర్నూలులో వీహెచ్ దీక్ష



హైదరాబాద్, ఫిబ్రవరి 12:తెలంగాణకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో దీక్షకు దిగారు. ఏపీలో జిల్లాల పునర్విభజన సందర్భంగా కర్నూలు జిల్లాకు దివంగత మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య పేరు పెట్టాలని? సంజీవయ్య ఇంటి ఎదుట తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు హనుమంతరావు ధర్నా నిర్వహించారు. ఆయనతో పాటు మాజీ ఎంపీ హర్షకుమార్ తదితరులు దీక్షలో పాల్గొన్నారు. కొత్త జిల్లాలకు ప్రముఖుల పేర్లను ప్రకటించిన ఏపీ సీఎం జగన్‌ను హనుమంతరావు అభినందించారు. కృష్ణా జిల్లాకు ఎన్టీఆర్, కడప జిల్లాకు వైఎస్సార్, మన్యం ప్రాంతాలకు అల్లూరి పేర్లు పెట్టిన విధంగా కర్నూలుకు సంజీవయ్య పేరు పెట్టాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రిగా దామోదరం సంజీవయ్య ఉమ్మడి రాష్ట్రానికి అనేక సేవలందించారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి ఈ విషయంపై పునరాలోచించాలని కోరారు.

## దళిత బందులో లాభదాయక యూనిట్ల ఏర్పాటుకు ప్రోత్సహించాలి.....!

**-జిల్లా కలెక్టర్ హనుమంతరావు.**

సంగారెడ్డి, ఫిబ్రవరి 12 (నేటి నిజం ప్రతినిధి) దళిత బంధు పథకం కింద లాభదాయకమైన యూనిట్లు ఎంపిక చేసుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించి ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు సంబంధిత అధికారులను ఆదేశించారు.

జిల్లాలో దళిత బంధు పథకం అమలుపై శనివారం కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

తరతరాలనుండి వస్తున్న దళితుల పేదరికం రూపుమాపడమే దళిత బందు పథకం ఉద్దేశమన్నారు. వారికి నిరంతరంగా ఆదాయం వచ్చేలా యూనిట్ ఎంపిక ఉండి, ఆర్థికంగా వృద్ధి చెందాలన్నారు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో వంద మందికి దళిత బంధు పథకం అమలు చేస్తున్నామన్నారు.

జిల్లా పరిధిలో ఇప్పటి వరకు 444 మంది లబ్ధిదారుల ఎంపిక పూర్తయిందని కలెక్టర్ తెలిపారు.దళిత బంధు యూనిట్ గ్రౌండింగ్ అంశం చాలా కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు.

లబ్ధిదారుల జాబితాను మరోమారు క్షుణ్ణంగా పరిశీలించాలని, అనర్హులను చేర్చకూడదన్నారు. సెక్టర్ ఎంపిక సరిగ్గా చేసుకునేలా లబ్ధిదారునికి సూచించాలన్నారు. ఎంపిక చేసుకున్న యూనిట్ తో వారికి ఆదాయం చేకూరేలా ఉండాలని స్పష్టం చేశారు.

లబ్ధిదారులు ఎంపిక చేసుకున్న ఆయా యూనిట్ల నిర్వహణపై వారికి ఉన్న అనుభవం , మార్కెటింగ్ ఎలా ఉన్నది, లాభదాయకమా,కాదా అన్న విషయమై అధ్యయనం చేసి లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ప్రత్యేక అధికారులకు సూచించారు. అధికారులు లాభదాయక యూనిట్లను సూచించాలని చెప్పారు.

అవసరమైన యూనిట్లకు సంబంధించి శిక్షణ ఇప్పించాలని, గ్రౌండింగ్ అయ్యేవరకు ఆయా అధికారులు పూర్తి బాధ్యత తీసుకోవాలన్నారు. నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీవోలు సంయుక్తంగా పనిచేయాలన్నారు.

లబ్ధిదారు ఎంపిక చేసుకున్న సెక్టర్ కు సంబంధించి , లబ్ధిదారులకు జిల్లాలో గల పరిమితులు అవకాశాలు, ఇతర ప్రాంతాల్లో గల అవకాశాలను వివరించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

లబ్ధిదారులు అందరూ ఒకే రంగంపై దృష్టి సారిస్తే అనుకున్న లక్ష్యాలు సాధించలేమని కలెక్టర్ తెలిపారు. లబ్ధిదారులకు ప్రస్తుత పరిస్థితులు వివరిస్తూ ప్రత్యామ్నాయ మార్గాలు సైతం సూచించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

దళిత బంధు పథకంలో లబ్ధిదారులు వారికి నచ్చిన యూనిట్లను ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. దళిత బంధు ద్వారా వచ్చే డబ్బుతో 2 లేదా 3 యూనిట్లను సైతం ప్రారంభించవచ్చని, అదే విధంగా ముగ్గురు లేదా 4 గురు లబ్ధిదారులు కలిసి ఒక పెద్ద యూనిట్ సైతం ప్రారంభించే అవకాశం ఉందన్నారు. ఆ విషయమై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు.

అనంతరం నియోజక వర్గం వారీగా లబ్ధిదారుల వివరాలు, వారు ఆసక్తి చూపుతున్న, ఎంపిక చేసుకున్న యూనిట్, తదితర అంశాలను ఆయా నియోజకవర్గఅధికారులను ఆరా తీసి పలు సూచనలు చేశారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రాజర్షి షా, వీరారెడ్డి, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబురావు, డిపిఓ సురేష్ మోహన్, హార్టికల్చర్ అధికారి సునీత, జిఎం పరిశ్రమలు,ఎస్సీ,ఎస్టీ శాఖల అధికారులు, రెవిన్యూ డివిజనల్ అధికారులు, డి ఆర్ డి ఎ అదనపు పి డి లు, ఎంపీడీవోలు, తదితరులు పాల్గొన్నారు.



## న్యూఢిల్లీలోని ఐసిఏఆర్-ఐఏఆర్ ఐ 60వ స్నాతకోత్సవంలో కేంద్ర వ్యవసాయ మంత్రి ప్రసంగం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:కేంద్ర వ్యవసాయ , రైతు సంక్షేమ శాఖ మంత్రి శ్రీ నరేంద్ర సింగ్ తోమర్ ఈ రోజు న్యూఢిల్లీ లోని పోస్ట్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ ఐసిఎఆర్-ఇండియన్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ కు చెందిన 8 మంది విదేశీ విద్యార్థులతో కూడిన 284 మంది విద్యార్థులకు అవార్డులు, డిగ్రీలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ తోమర్ ఆరు పండ్లు, కూరగాయల రకాలను దేశ ప్రజలకు అంకితం చేశారు. వీటిలో రెండు రకాల మామిడి పుసా లలిమా, పుసా శ్రేష్ , వంకాయ రకం పుసా వైభ వ్ , పాలక్ రకం పుసా విలాయతి పాలక్ , దోసకాయ వెరైటీ పుసా గైనోసియస్ దోసకాయ హైబ్రిడ్ -18, పూసా అల్పానా వెరైటీ రోజ్ ఉన్నాయి. మైక్రోబయాలజీ విభజన ద్వారా అభివృద్ధి చేసిన బయో ఫెర్టిలైజర్ 'పుసా సంపూర్ణ' ను కూడా విడుదల చేశారు.

ఈ సమావేశాన్ని ఉద్దేశించి శ్రీ నరేంద్ర సింగ్ తోమర్ ప్రసంగిస్తూ, అన్ని వ్యవసాయసంస్థలు మంచి రైతులను అందించడంపై దృష్టి సారించాలని పిలుపు ఇచ్చారు. ఇన్ స్టిట్యూట్ లు చాలా ప్రతిభావంతులైన ఉపాధ్యాయులు, శాస్త్రవేత్తలను తయారు చేస్తున్నాయని, ఇది ప్రశంసనీయమైనదని ఆయన అన్నారు. ఇందువల్ల విజ్ఞానం , సాంకేతికత సంస్థలకు మాత్రమే పరిమితం అయిందని అన్నారు. సంస్థలు రైతులను కనుక తయారు చేస్తే వారు ఈ విజ్ఞానాన్ని అట్టడుగు స్థాయికి తీసుకు రాగలరని అన్నారు. విద్యార్థులు వ్యవస్థాపకత్వ అభివృద్ధి చేపట్టాలని, వ్యవసాయాన్ని వృత్తిగా తీసుకోవాలని శ్రీ వ్యవసాయ పరిశోధన రంగంలో ప్రభుత్వ ప్రాధాన్యతలను ప్రస్తావిస్తూ, ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత దేశం 10 అగ్రశ్రేణి వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి దేశాలలో స్థానం సంపాదించిందని శ్రీ తోమర్ తెలిపారు. "భారత దేశాన్ని టాప్ 5 దేశాలలో ఉంచాలని మేం లక్ష్యంగా పెట్టుకున్నాం. మన వ్యవసాయ సంస్థల ప్రయత్నాలు, పరిశోధన లతో భారత దేశం అతి త్వరలోనే ఈ లక్ష్యాన్ని సాధిస్తుందని నేను విశ్వసిస్తున్నాను" అనిమంత్రి అన్నారు.

రైతుల ప్రయోజనం కోసం డ్రోన్ టెక్నాలజీ ని ఉపయోగించడం పైన, వివిధ భాగస్వాములకు ఉపాధి కల్పన పైన వ్యవసాయ మంత్రి మాట్లాడుతూ, వ్యవసాయ సంస్థలకు డ్రోన్ల కొనుగోలుకు ప్రభుత్వం 100% గ్రాంట్ గా ఇస్తోందని, తద్వారా సాంకేతిక పరిజ్ఞానాన్ని సంస్థలలో బోధించవచ్చని అన్నారు. డ్రోన్ కొనుగోళ్లకు గ్రాంట్ మద్దతు పొందడానికి వ్యవసాయ గ్రాడ్యుయేట్లు కూడా అర్హులని ఆయన చెప్పారు. డ్రోన్ టెక్నాలజీ రంగంలో దీనిని భారీ అవకాశంగా చూడాలని కొత్త గ్రాడ్యుయేట్లకు మంత్రి సూచించారు.

వ్యవసాయ రంగంలో మెరుగైన రకాలు సాంకేతిక పరిజ్ఞానాల అభివృద్ధి ద్వారా ఆహారం ,పోషకాహార భద్రతను నిర్ధారించడానికి సంస్థ అందించిన గణనీయమైన సహకారాన్ని వ్యవసాయ మంత్రి ప్రశంసించారు. అవార్డు గ్రహీతలందరినీ శ్రీ తోమర్ అభినందిస్తూ , అత్మ నిర్భర్ కృషి ద్వారా అత్మ నిర్భర్ భారత్ విజయ గాధకు తోడ్పడాలని వారికి విజ్ఞప్తి చేశారు.

అంతకుముందు, సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఎ.కె. సింగ్ మాట్లాడుతూ, సంస్థ గణనీయమైన విజయాలను వివరించారు. సంస్థ అభివృద్ధి చేసిన గోధుమ రకాలు దేశ ధాన్యాగారానికి ఏటా రూ.80,000 కోట్ల విలువైన దాదాపు 60 మిలియన్ టన్నుల గోధుమలను అందిస్తాయని తెలియజేశారు. అదేవిధంగా, సంస్థ అభివృద్ధి చేసిన బాస్మతి రకాలు భారతదేశంలో బాస్మతి సాగులో ప్రధాన రకాలుగా ఉన్నాయి.

అదేవిధంగా, బాస్మతి బియ్యం ఎగుమతి ద్వారా సంపాదించిన మొత్తం విదేశీ మారకద్రవ్యం లో 90 శాతం వాటా (రూ. 29524 కోట్లు) అదేవిధంగా, ఇన్స్టిట్యూట్ అభివృద్ధి చేసిన బాస్మతి రకాలు భారతదేశంలో బాస్మతి సాగులో ప్రధానమైనవి, బాస్మతి బియ్యం ఎగుమతి ద్వారా లభించిన రు. 32.084 కోట్లలో మొత్తం విదేశీ మారక ద్రవ్యం వాటా 90% (రూ. 29524 కోట్లు). దేశంలో ఆవాలను పండించే ప్రాంతంలో 48% ఐఏఆర్ఐ రకాలతో సాగు చేస్తున్నారు. పూసా మస్టర్డ్ 25 నుంచి ఉత్పత్తి అయ్యే మొత్తం ఆర్థిక మిగులు గత 9 సంవత్సరాల్లో రూ.14323 కోట్లు (2018 ధరల వద్ద) గా అంచనా వేయబడింది. ఈ సందర్భంగా నాబార్డ్-ప్రొఫెసర్ వి ఎల్ చోప్రా గోల్డ్ మెడల్ , ఎంఎస్ సీ, పీహెచ్ డీలకు బెస్ట్ స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ అవార్డును వరుసగా శ్రీమతి దేబరాటి మొండల్, డాక్టర్ సిద్ధరూద్ మరాగల్ లకు ప్రదానం చేశారు. ప్రొఫెసర్ ఆర్.బి. సింగ్; న్యూఢిల్లీలోని ఐఎఆర్ఐ మాజీ డైరెక్టర్ డిఎస్ సి హనరిస్ కాసా కు ప్రదానం చేశారు. ఎఎ డాక్టర్ ఎ.బి. జోషి మెమోరియల్ అవార్డును న్యూఢిల్లీలోని ఐసిఎఆర్ ఎడిజి (సీడ్స్) డాక్టర్ డి.కె.యాదవ్ కు ప్రదానం చేశారు. 2వ అత్యుత్తమ వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త అవార్డును న్యూఢిల్లీలోని ఐఏఆర్ ఐ లోని వ్యవసాయ విస్తరణ విభాగం హెడ్ అండ్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.ఎన్. పడారియాకు ప్రదానం చేశారు. ఎక్స్ సిఐఐ శ్రీ హరి కృష్ణ శాస్త్రి స్మారక పురస్కారాన్ని న్యూఢిల్లీలోని ఐఎఆర్ ఐ లోని వెజిటబుల్ సైన్స్ విభాగం ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఎ.డి. మున్షీకి ప్రదానం చేశారు. ఆర్ సిఐఐ సుకుమార్ బసు మెమోరియల్ అవార్డును డైరీ కెమిస్ట్రీ డివిజన్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ రాజన్ శర్మకు ప్రదానం చేశారు, ఐసిఎఆర్-ఎన్ డిఆర్ ఐ, కర్నాల్ ,ఐఎఆర్ఐ బెస్ట్ టీచర్ అవార్డును న్యూఢిల్లీలోని అగ్రోనమీ విభాగం డాక్టర్ సి.ఎం.పరిహార్ కు ప్రదానం చేశారు. వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి శ్రీ కైలాశ్ చౌదరి ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా పాల్గొన్నారు. డాక్టర్ త్రిలోచన్ మోహపాత్ర, సెక్రటరీ డిఎఆర్ ఈ , డైరెక్టర్ జనరల్, ఐసిఎఆర్ ,డీన్, జాయింట్ డైరెక్టర్ (ఎడ్యుకేషన్) డాక్టర్ రష్మీ అగర్వాల్ కూడా హాజరయ్యారు.

ఈ కార్యక్రమానికి డిప్యూటీ డైరెక్టర్ జనరల్స్, కౌన్సిల్ అదనపు డైరెక్టర్ జనరల్స్, ఇనిస్టిట్యూట్ మాజీ డైరెక్టర్లు ,డీన్స్, ప్రాజెక్ట్ డైరెక్టర్ (డబ్ల్యుటిసి), డివిజన్ల అధిపతులు, ప్రొఫెసర్లతో సహా ఇతర ప్రముఖులు కూడా హాజరయ్యారు. పెద్ద సంఖ్యలో ఇనిస్టిట్యూట్ ఫ్యాకల్టీ సభ్యులు, విద్యార్థులు ,సిబ్బంది వర్చువల్ మోడ్ ద్వారా ఈ కార్యక్రమాన్ని వీక్షించారు.



## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఇస్రో శాస్త్రవేత్తలు



తిరుమల, ఫిబ్రవరి 12:ఇస్రో శాస్త్రవేత్తలు ఈరోజు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. పీఎస్ఎల్వీ-సీ 52 ప్రయోగం విజయవంతం కావాలంటూ, రాకెట్ నమూనాను మూలవిరాట్టు పాదాల దగ్గర ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం.. ఆలయ అధికారులు..శాస్త్రవేత్తలకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ నెల 14న ఉదయం 5గంటల 59 నిమిషాలకు శ్రీహరికోట షార్ నుంచి నింగిలోకి రాకెట్ దూసుకెళ్లనుంది. పీఎస్ఎల్వీ-సీ 52 ప్రయోగం విజయవంతం కావాలని కోరుకున్నట్లు తెలిపారు.

## వ్యర్థాల నుంచి వెలుగులు.. దుండిగల్‌లో 14.5 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్..

హైదరాబాద్, ఫిబ్రవరి 12:వ్యర్థాల నుండి తయారయ్యే మరో విద్యుత్ (వేస్ట్ టూ ఎనర్జీ) ప్రాజెక్టు ఏర్పాటుకు జీహెచ్ఎంసీ ముందుకొచ్చింది. ఈ ప్లాంట్‌ను దుండిగల్‌లో ఏర్పాటు చేసేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. ఇంటిగ్రేటెడ్ మున్సిపల్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్(ఐఎంఎస్‌డబ్ల్యూఎం) ప్రాజెక్టు ద్వారా ఇప్పటికే జవహర్ నగర్ డంపింగ్ యార్డులో 19.8 మెగావాట్ల విద్యుత్‌ను తయారు చేస్తున్న పాఠకులకు విధితమే. జీహెచ్ఎంసీ దాని చుట్టు ప్రక్కల పట్టణ ప్రాంతాలకు చెందిన చెత్తను జవహర్ నగర్ డంప్ యార్డుకు తరలించే ప్రక్రియను సమగ్ర మున్సిపల్ ఘన పదార్థాల నిర్వహణ ప్రాజెక్టు (ఐఎంఎస్‌డబ్ల్యూఎం) గా చేపట్టిన విషయం విధితమే.

ఇళ్ల నుండి సేకరించిన చెత్తను సెకండరీ కలెక్షన్, ట్రాన్స్‌ఫర్ పాయింట్స్(ఎస్సీటీ-పీ) నుండి వ్యర్థాలను జవహర్ నగర్ డంప్ యార్డుకు తరలిస్తారు. అక్కడ యాంత్రికంగా సెగ్రిగేట్ చేసిన తర్వాత మండే గుణం గల వ్యర్థాలను వేరు చేస్తారు. 19.80 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు రోజుకు 1200 నుండి 1500 టన్నుల వ్యర్థాలు అవసరం ఉంటుంది. ఆ విధంగా ఆగస్టు 2020 నుండి నవంబర్ 2021 వరకు 5.4 లక్షల మెట్రిక్ టన్నుల ఆర్డీఎఫ్(రెఫ్యూస్ డెరివుడ్ ఫ్యూయల్) వ్యర్థాలను వినియోగించి, ఇప్పటి వరకు 185 మిలియన్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. జీహెచ్ఎంసీ ద్వారా 6,500 టన్నుల పైబడి చెత్తతో పాటు, చుట్టూ ప్రక్కల వున్న 17 మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ద్వారా ప్రతిరోజూ 600 టన్నుల చెత్తతో మొత్తం 7వేల టన్నుల వ్యర్థాలు జవహర్ నగర్ డంప్ యార్డుకు తరలిస్తున్నారు. పేరుకు పోయిన వ్యర్థాల వలన పక్కన ఉన్న ప్రజలకు ఇబ్బంది కలగకుండా నిరోధించేందుకు 19.8 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌ను 48 మెగావాట్లకు పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం సంకల్పించింది. ఆ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం కూడా అనుమతినిచ్చిన నేపథ్యంలో ఆయా పనులను 18 నెలల్లో పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చేందుకు జీహెచ్ఎండీ అధికారులు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు.

ఏర్పాటు చేయనున్న కొత్త ప్లాంట్‌తో జవహర్ నగర్ డంపింగ్ యార్డుపై భారం తగ్గనుంది. దుండిగల్‌లో గల ట్రీట్‌మెంట్ స్టోరేజ్ డిస్పోజల్ ఫెసిలిటీకి సంబంధించిన ఏర్పాట్లను ఇప్పటికే భూమిలో సిద్ధం చేశారు. మిగిలిన విద్యుత్ ప్లాంట్ పనులను పూర్తి చేసి సెప్టెంబర్ 2022 నుండి ఉత్పత్తిని ప్రారంభిస్తారు. వ్యర్థం నుండి విద్యుదుత్పత్తి చేసేందుకు అవసరమైన చెత్తను దుండిగల్ పరిసర పట్టణ ప్రాంతాల నుండి, జీహెచ్ఎం సీ పరిధిలో గల ప్లాంట్‌కు సమీపంలో గల ప్రాంతాల నుండి తరలిస్తారు. దీంతో జవహర్ నగర్ డంప్ యార్డుకు కొంచెం భారం తగ్గే అవకాశం ఉంది. 14.5 మెగా వాట్ల విద్యుదుత్పత్తికి 1000 టన్నుల వ్యర్థం అవసరం ఉంటు-ంది. వ్యర్థం నుండి విద్యుత్ తయారీకి యాప్రాల్‌లో 14 మెగావాట్లు-, బీబీనగర్ దగ్గర చిన్నరేవులపల్లిలో 11 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ప్రైవేటు-సంస్థలు ముందుకు వచ్చినప్పటికీ వివిధ కారణాల వలన ప్లాంట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయలేక పోతున్నారు.

## ఈ నెల 25 నుంచి నుమాయిష్ తిరిగి ప్రారంభం..

హైదరాబాద్, ఫిబ్రవరి 12:గత నెల 25న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేతుల మీదుగా లాంఛనంగా ప్రారంభమైన 8వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనను మరుసటి రోజున కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన ఉత్తర్వుల మేరకు అర్థాంతరంగా మూసేశారు. తాజాగా కొవిడ్ నిబంధనలను సడలించడంతో ఎగ్జిబిషన్ నిర్వహించాలని నిర్ణయించారు. ప్రతి ఏడాది నిర్వహించే నుమాయిష్ ను నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఈ నెల అధికారికంగా పున:ప్రారంభించేందుకు సొసైటీ పాలకవర్గం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందగానే నుమాయిష్ ప్రారంభ తేదీని అధికారికంగా ప్రకటిస్తామని సొసైటీ వెల్లడించింది. కాగా, ఈనెల 25 నుంచే నుమాయిష్ మళ్లీ ప్రారంభం కానున్నట్లు తెలుస్తుంది.

**పదిహేను వందలకు పైగా స్టాల్లు..**

ఈ సారి నుమాయిష్‌లో భారీగా స్టాళ్లను ఏర్పాటు చేసేలా పాలకవర్గం నిర్ణయం తీసుకుంది. రేండేళ్లుగా పరిస్థితులు అనుకూలించక సరైన అమ్మకాలు లేవు. గత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, ఈ సారి ఎవరూ నష్టపోకుండా ప్రత్యేక ప్రణాళికతో స్టాళ్లను ఏర్పాటు చేయనున్నారు. పదిహేను వందలకు పైగా స్టాళ్లతో కొనసాగించేందుకు మైదానంలో ఏర్పాట్లు చేశారు. కొవిడ్ కారణంగా మూసేసినా స్టాళ్లను అలాగే ఉంచారు. అయితే కరోనా ఎప్పుడు తగ్గుతుందో? నుమాయిష్ ఎప్పుడు ప్రారంభమవుతుందోనని ఆందోళనకు గురైన స్టాళ్ల నిర్వాహకులు దాదాపు 30 శాతం మంది తమ డబ్బులను తిరిగి తీసుకొని వెళ్లిపోయారు. మిగిలిన 70 శాతం స్టాళ్ల నిర్వాహ కులు నుమాయిష్ ఎప్పుడు ప్రారంభిస్తే అప్పుడు వ్యాపారాలు నిర్వహిస్తామని.. ఇచ్చిన అడ్వాన్స్ వెనక్కి తీసుకోకుండా వెళ్లిపోయారు. దీంతో సొసైటీ పాలకవర్గం మైదానంలో ఏర్పాటు చేసిన స్టాళ్ల నిర్వాహకులకు ఎగ్జిబిషన్‌ను తిరిగి ప్రారంభిస్తామనితమ వస్తువులను తెచ్చుకోవచ్చని ఆహ్వానాలుఫోన్ మెసేజ్‌లను పంపుతున్నారు.

మరోవైపు గతంలో జరిగిన ఫైర్ యాక్సిడెంట్ ఘటనతో ప్రస్తుతం అనేక జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. ఎలాంటి ప్రమాదం జరగకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు. దీనిపై పాలకవర్గం ప్రత్యేక కసరత్తు కూడా చేసింది. దీంతో ఈ ఏడాది మరింత సరుక్షితంగా నుమాయిష్ నిర్వహించేలా పాలకవర్గం ప్రణాళికబద్ధంగా వ్యవహరిస్తుంది. అయితే అధికారికంగా వెల్లడిస్తే, స్టాళ్ల నిర్వాహకులు తమ ఏర్పాట్లను చేసుకునే అవకాశాలు ఉన్నాయి.



## దేశంలో విధానాలన్నీ మోదీ ఇద్దరు మిత్రుల కోసమే : ప్రియాంక గాంధీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా విరుచుకుపడ్డారు. దేశంలో ప్రస్తుతం రూపొందుతున్న విధానాలన్నీ మోదీ ఇద్దరు మిత్రుల ప్రయోజనం కోసమేనని ఆరోపించారు. ఉత్తరాఖండ్ శాసన సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె శనివారం ఖటిమా సిటీలో ఓ బహిరంగ సభలో మాట్లాడారు. ముఖ్యమంత్రి నుంచి ప్రధాన మంత్రి వరకు బీజేపీ నేతలంతా తమ స్వార్థ ప్రయోజనాల కోసమే పని చేస్తున్నారని, వారికి ప్రజల గురించి పట్టదని ప్రియాంక ఆరోపించారు. ప్రజల గురించి ఎవరూ ఆలోచించడం లేదన్నారు. దేశంలో కరోనా వైరస్ మహమ్మారి పెరగడానికి కారణం కాంగ్రెసేనని మోదీ ఆరోపించారన్నారు. కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు కేవలం తమ కర్తవ్యాన్ని మాత్రమే నిర్వహించారని చెప్పారు. అష్ట దిగ్బంధనం అమలైన సమయంలో వలస కూలీలు రోడ్లపై నడుచుకుంటూ వెళ్ళారని, వారికి ఎటువంటి సదుపాయాలు లేవని గుర్తు చేశారు. వాళ్ళని అలాగే వదిలేయాలా? మేం రాజకీయాలు చేశామా? అని ప్రశ్నించారు. తాము తమ కర్తవ్యాన్ని నిర్వహించామని తెలిపారు.

ఉత్తరాఖండ్‌లో ఉపాధి అవకాశాలు లేనందువల్ల ఎక్కువ మంది ప్రజలు వలస పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రాష్ట్రంలో హిమాలయాలు, ప్రకృతి, పర్యాటక అవకాశాలు ఉన్నాయని, కానీ ఉపాధి మాత్రం లేదని అన్నారు. దేశవ్యాప్తంగా విధానాలన్నీ కేవలం ఇద్దరు పారిశ్రామికవేత్తల కోసం రూపొందుతున్నాయన్నారు. ఆ ఇద్దరూ మోదీకి మిత్రులని చెప్పారు. బడ్జెట్‌లో రైతులు, మధ్య తరగతి వర్గాలు, పేదల కోసం ఏమీ లేదన్నారు.

# అంబేద్కర్‌ని ఆరాధిస్తా - ఫ్రీగా అంబేద్కర్ జీవిత నాటక ప్రదర్శన - సీఎం కేజ్రీవాల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:మనదేశంలోని గొప్ప నాయకుల్లో అంబేద్కర్ ఒకరనీ, ఆయన జీవితం స్ఫూర్తిధాయకమని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. భారత రాజ్యాంగ పితామహుడు బిఆర్ అంబేద్కర్ జీవితంపై రూపొందించిన నాటకాన్ని ఫిబ్రవరి 25 నుంచి, మార్చి 12 వరకు జేఎల్ఎన్ స్టేడియంలో ప్రదర్శిస్తామని అరవింద్ కేజ్రీవాల్ వెల్లడించారు. ఈ నాటకాన్ని జనవరి 5 నుండి ప్రదర్శించాల్సి ఉంది. కరోనా కేసుల పెరుగుదల కారణంగా ఈ నాటక ప్రదర్శనలను వాయిదా వేశారు. జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ప్రతిరోజూ రెండు షోలను నిర్వహిస్తామనీ కేజ్రీవాల్ చెప్పారు. ఈ నాటకాన్ని పూర్తిగా ఉచితంగా చూడొచ్చని అన్నారు. అంబేద్కర్ జీవితం స్ఫూర్తిధాయకమని ..ఆయనకు ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు, అభిమానులు ఉన్నారనీ, తాను కూడా బాబాసాహెబ్ అంబేద్కర్ భక్తుడనీ, అతనిని ఆరాధిస్తానని తెలిపారు.

అంబేద్కర్ జీవితాంతం పోరాడి పేదలకు, దళితులకు న్యాయం జరిగేలా పోరాడారని, పేద కుటుంబం నుండి వచ్చి న్యాయ మంత్రి అయ్యాడని కేజ్రీవాల్ వివరించారు. గతేడాది డిసెంబర్‌లో మహాపర్నిర్వాణ దివాస్ సందర్భంగా.. బాబా సాహెబ్ జీవితం ఆధారంగా నాటకాన్ని రూపొందించి, ప్రదర్శనను నిర్వహించాలని ఢిల్లీ ప్రభుత్వం నిర్ణయించింది. తద్వారా.. ఢిల్లీ ప్రజలు ఆయన జీవితం నుండి ప్రేరణ పొందారని, ఈ నాటక ప్రదర్శనను జనవరి 5 నుంచి ప్రారంభించాలని నిర్ణయించింది. కానీ, ఒమిక్రాన్ కారణంగా వాయిదా వేయాల్సి వచ్చింది. ఇది ఇప్పుడు ఫిబ్రవరి 25 నుండి మార్చి 12 వరకు ప్రదర్శించాలని నిర్ణయించారు.

# పెరగనున్న గ్యాస్ సిలిండర్ ధరలు !



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన తర్వాత సిలిండర్ ధర భారీగా పెరిగి ఛాన్స్ ఉందని సమాచారం. అంతర్జాతీయ మార్కెట్ లో ముడి చమురు ధర బ్యారెల్ కు 92డాలర్ల పైకి చేరింది. గ్యాస్ సిలెండర్ ధర లో ఏ మార్పు లేదు. 2021 అక్టోబర్ 6 నుంచి ధర స్థిరంగానే వుంది. మార్చి 10 తర్వాత గ్యాస్ సిలిండర్ ధర రూ.100కు పైగా పెరిగే అవకాశం ఉంది. ఇదే కనుక జరిగితే సామాన్యులపై ఎఫెక్ట్ పడనుంది. 2021 అక్టోబర్ నుంచి 2022 ఫిబ్రవరి 1 వరకు చూస్తే కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.170 పైకి చేరింది. అక్టోబర్ 1న ఈ సిలిండర్ ధర ఢిల్లీలో రూ.1736 వద్ద ఉండేది. ఇక నవంబర్ కి వచ్చే సరికి రేటు రూ.2 వేలకు చేరింది. అదే డిసెంబర్‌లో అయితే రూ.2,101కు వెళ్ళింది. ఇక జనవరి, ఫిబ్రవరి నెలల్లో ధర తగ్గింది. ఇప్పుడు ఈ సిలిండర్ ధర రూ.1907 వద్ద వుంది. అదే పది కేజీల సిలెండర్ అయితే రూ. 634కే పొందొచ్చు. ఇది ఇలా ఉంటే ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ప్రతి నెలా ఒకటో తేదీన ధరలు సవరిస్తూ ఉంటాయి. దీనితో సిలెండర్ ధరలు పెరగొచ్చు, తగ్గచ్చు. గ్లోబల్ మార్కెట్‌లో ముడి చమురు ధరలకు అనుగుణంగా రేట్లు అనేవి ఉంటాయనే సంగతి తెలిసిందే

# మెదక్ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం...!!



మెదక్, ఫిబ్రవరి 12, (నేటి నిజం ప్రతినిధి) జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద రూ.28 కోట్లతో సీసీ రోడ్లు మంజూరయ్యాయని, ఆయా రోడ్డు పనులకు ఇసుక కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మెదక్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి అన్నారు. మెదక్ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం చైర్పర్సన్ ర్యాకల హేమలత అధ్యక్షతన శనివారం కలెక్టరేట్లోని ఆడిటోరియం లో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని మండలాల్లో సీసీ రోడ్లతో పాటు, బీటీ రెన్యూవల్ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని పంచాయతీరాజ్ ఎస్.ఇ. కనకరత్నంకు సూచించారు. పంచాయతీ రాజ్ ఎస్ ఈ కనక రత్నం మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో 378 సీ సీ రోడ్ల నిర్మాణానికి 22 కోట్ల 91 లక్షలు మంజూరు అయ్యాయని తెలిపారు. అలాగే 57 కిలో మీటర్ల బీ టీ రోడ్డు రెన్యువల్ పనులకు 9 కోట్లు మంజూరు అయ్యాయని చెప్పారు. తూప్రాన్ లో 7 కోట్లతో, మనోహరబాద్ లో 5 కోట్లతో ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్ ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్టు ఎస్ ఈ వెల్లడించారు.

వైద్యారోగ్య శాఖపై సమీక్ష సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొదటి, రెండో డోస్ కోవిషీల్డ్ వేసుకున్న వారు బూస్టర్ డోస్ గా కోవాక్జిన్ వేసుకోవాలనుకుంటున్నటు తమ దృష్టికి వచ్చిందని అలా వేసుకోవచ్చా అని అడిగారు. దీనిపై డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వర్ రావ్ స్పందిస్తూ అలా కాక్ టైల్ వ్యాక్సిన్ తీసుకోవచ్చని సైంటిస్టు చెప్పినప్పటికి, ఐ.సి.ఎం.ఆర్. మాత్రం అలా వేయొద్దని, రెండు డోసులు ఏ వ్యాక్సిన్ వేసుకుంటే బూస్టర్ డోస్ కూడా అదే వ్యాక్సిన్ వేయాలని సూచించినట్టు తెలిపారు. ఎవరైనా కోరితే కాక్టైల్ వ్యాక్సిన్ వేస్తున్నట్టు చెప్పారు. జిల్లాలో ఫస్ట్ డోస్ వ్యాక్సిన్ 112 శాతం పూర్తయిందని, ఈ విషయంలో మెదక్ జిల్లా రాష్ట్రంలోనే రెండో స్థానంలో ఉందన్నారు. సెకండ్ డోస్ వ్యాక్సినేషన్ కూడా 100 శాతం పూర్తయిందని చెప్పారు. బూస్టర్ డోస్ 9 వేల మందికి వేయడం జరిగిందని తెలిపారు. ప్రజాప్రతినిధులకు బూస్టర్ డోస్ వేస్తున్నామని చెప్పారు. 15 నుంచి 17 సంవత్సరాల వారు జిల్లాలో 37 వేల మంది ఉండగా వారికి 98 శాతం వ్యాక్సిన్ వేయడం పూర్తయిందన్నారు. ఇంటింటి జ్వర సర్వేలో మొదటి విడతలో 1.89 లక్షల కుటుంబాలు సర్వే చేసి 14 వేల కిట్లు, రెండో విడల సర్వేలో 15 వేల కిట్లు పంపిణీ చేశామని తెలిపారు. కొత్త మండలాల్లోని మండల కార్యాలయాల్లో ఫర్నీచర్, సిబ్బంది కొరత తీర్చాలని, బడ్జెట్ సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి జెడ్పీ సీఈఓ కు సూచించారు.

వ్యవసాయ శాఖను సమీక్షిస్తూ ప్రభుత్వ సూచనల మేరకు ఈ యాసంగిలో వారికీ బదులు ప్రత్యామ్నాయ పంటలపై రైతులు ముగ్గు చూపేలా అవగాహన కలిగించామని, గతేడాది 2 లక్షల 26 వేల ఎకరాలలో వరి సాగు కాగా ఈ సారి లక్ష ఎకరాలకు తగ్గించామని అన్నారు. వేరుశనగ, మినుము,పొద్దు తిరుగుడు, తదితర పంటల బాగున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. కాగా మెదక్ జిల్లాను కూడా ఆయిల్ ఫామ్ పంటలకు అనువుగా ఉన్నందున రైతులను ఆ పంటలపై వైపు మొగ్గు చూపేలా వ్యవసాయాధికారులు అవగాహన కలిగించాలని అన్నారు. అదేవిధంగా ఆర్గానిక్ పంటలను ప్రోత్సహించాలని సూచించారు. ఈ సమావేశంలో శాసన మండలి సభ్యులుయాదవ రెడ్డి, అదనపు కలెక్టర్లు ప్రతిమ సింగ్, రమేష్, జిల్లా పరిషద్ ముఖ్య కార్యనిర్వహణాధికారి శైలేష్, డి.ఎం.అండ్ హెచ్.ఓ వెంకటేశ్వర్ రావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి పరశురామ్ నాయక్, పంచాయత్ రాజ్ ఎస్.ఈ. కనకరత్నం, జిల్లా అధికారులు, జెడ్.పి .టి.సి. లు, ఎం.పి .పి . లు తదితరులు పాల్గొన్నారు.

# 39 రోజుల్లో మూడు సార్లు పార్టీ మారిన ఎమ్మెల్యే

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయాలు వేడెక్కాయి. పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నుంచి ఓ కీలక నేత బీజేపీలో చేరారు. గతంలో బీజేపీలో ఉన్న హరగోవింద్‌పూర్ సిట్టింగ్ ఎమ్మెల్యే బల్వీందర్ సింగ్ లడ్డీ తిరిగి మళ్లీ సొంతగూటికే చేరారు. బీజేపీతో విడిపోయిన తర్వాత బల్వీందర్ సింగ్ లడ్డీ జనవరి 3న కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ లో చేరిన కేవలం 39 రోజుల్లోనే మళ్లీ హస్తాన్ని వీడి కాషాయ కండువా కప్పుకున్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత పర్తాప్ సింగ్ బజ్వా తమ్ముడు అయిన బజ్వాతో పాటు లడ్డీ డిసెంబరు 28న దేశరాజధాని ఢిల్లీలో కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరారు.

అయితే, కాషాయ పార్టీలో చేరిన 6 రోజుల తర్వాత, లడ్డీ తిరిగి కాంగ్రెస్ గూటికి చేరారు. పంజాబ్ వ్యవహారాల ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ హరీష్ చౌదరి, సీఎం చరణ్‌జిత్ సింగ్ చన్నీ సమక్షంలో పంజాబ్ పాలక సంస్థలో తిరిగి చేరారు. గురుదాస్‌పూర్ జిల్లాలోని హరగోవింద్‌పూర్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసినందుకు లడ్డీకి కాంగ్రెస్ టిక్కెట్ ఇచ్చేందుకు నిరాకరించింది. లడ్డీ స్థానంలో మన్‌దీప్ సింగ్‌ను కాంగ్రెస్ నామినేట్ చేసింది. అసంతృప్తితో ఉన్న లడ్డీ.. పార్టీలో చేసేదేమిలేక మళ్లీ సొంత పార్టీలో చేరారు. ఇలా ఆయన 39 రోజుల్లోనే మూడుసార్లు పార్టీ మారారు.

# గుర్తించబడిన క్రాఫ్ట్ వ్యక్తులు ప్రతి నెలా రూ. 1000/- ఎక్కువగా సంపాదించేలా చూసేందుకు సినర్జీలో పని చేయాలి-శ్రీ పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:కేంద్ర వాణిజ్యం ఓ పరిశ్రమలు, జౌళి, వినియోగదారుల వ్యవహారాలు మరియు ప్రజాపంపిణీ శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ అధ్యక్షతన డిజైనర్లతో సమావేశం జరిగింది. భారతదేశాన్ని ప్రపంచానికి ఫ్యాషన్ రాజధానిగా మార్చడంతో పాటు మన సంస్కృతి మరియు క్రాఫ్ట్ వారసత్వాన్ని తీసుకువెళ్లే మన దేశంలోని కళాకారులు మరియు చేనేత కార్మికులను సాధికారపరచడంపై ఈ సమావేశం ఆలోచనలు చేసింది. జౌళి మంత్రిత్వ శాఖ సెక్రటరీ యు.పి. సింగ్ మరియు నిఫ్ట్ డైరెక్టర్ జనరల్ శ్రీ శాంత్‌మను కూడా ఈ సదస్సులో పాల్గొన్నారు.

ఈ సమావేశానికి భారతదేశంలోని చేనేత మరియు హస్తకళా రంగాలలో గణనీయమైన అనుభవం ఉన్న 27 మంది నిఫ్ట్ పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. భారతీయ క్రాఫ్ట్ రంగానికి విశేషమైన సహకారం అందించిన కొంతమంది సీనియర్ డిజైనర్ల సమ్మేళనం ఇందులో కనిపించింది. వీరిలో సునీతా శంకర్, శ్రీ సబ్యసాచి ముఖర్జీ, శ్రీమతి తస్వీన్ రట్టి, శ్రీ సుకేత్ ధీర్, శ్రీమతి ఉమా ప్రజాపతి, శ్రీ పర్మీందర్ పాల్ సింగ్, శ్రీమతి కరిష్మా ఆచార్య, శ్రీమతి అనవిలా మిశ్రా, శ్రీమతి నిధియాషా, శ్రీమతి నివేదితసాబూ, శ్రీమతి మనీష్ త్రిపాఠి, శ్రీమతి అంజలి పురోహిత్, శ్రీమతి అనిందిత సర్దార్, శ్రీ అక్షయ్ సింగ్, శ్రీ సార్థక్ సేన్‌గుప్తా, మిస్టర్ సమంత్ చౌహాన్, శ్రీ సిద్ధార్థ్ సిన్హా, మిస్టర్ జాయ్ మిత్ర, శ్రీమతి మన్నాత్ సేథి, శ్రీ హర్‌ప్రీత్ పదమ్, శ్రీ పద్మ రాజ్ కేత్రీ, శ్రీమతి రింకీ గౌతమ్, మిస్టర్ అభిషేక్ గుప్తా, శ్రీ గౌరవ్ జై గుప్తా, శ్రీ వైభవ్ అగర్వాల్, మరియు శ్రీ ప్రియాంకుర్ సేన్‌గుప్తా, శ్రీమతి అనిందిత సర్దార్ ఓ మిస్టర్ అక్షయ్ దీప్ సింగ్‌లు ఉన్నారు.

డిజైనర్ హస్తకళల వ్యక్తుల సహకారం మరియు సాంకేతికత, మార్కెటింగ్ వ్యూహాల జోక్యాలు క్రాఫ్ట్ యొక్క స్కేలబిలిటీని ఎలా పెంచుతాయి అనే దాని గురించి చర్చించడం ఈ సమావేశం యొక్క ఉద్దేశ్యం. క్రాఫ్ట్ మరియు క్రాఫ్ట్ వ్యక్తుల రక్షణ, క్రాఫ్ట్ యొక్క జీవనోపాధి రూపకర్తల అభిప్రాయాలలో కొన్ని. క్రాఫ్ట్ లగ్జరీ హోదా ఇవ్వాలి, ఎందుకంటే అది ప్రేమతో కూడిన శ్రమ.

శ్రీ గోయల్ వారి దృక్కోణంతో పాటు భారతీయ చేతిపనుల పట్ల వారికి ఉన్న అభిరుచికి డిజైనర్లను అభినందించారు. ఒక దేశం యొక్క కళ, సంస్కృతి, సంప్రదాయం మరియు వారసత్వాన్ని గౌరవించాలని ఉద్ఘాటించారు. లేవనెత్తిన లేదా చర్చించిన అన్ని అంశాలు బాగా గుర్తించబడ్డాయి మరియు ముందుకు సాగే మార్గంలో పరిగణనలోకి తీసుకుంటామని అతను డిజైనర్లకు హామీ ఇచ్చాడు. వారంలో ఒకరోజు ఖాదీ/చేనేత వస్త్రాలు ధరించాలనే ఆలోచన, దేశానికి గర్వకారణంగా ఉన్న డిజైనర్ల భావన ప్రశంసించబడింది. "ఇది చాలా అవకాశాలను తెరుస్తుంది మరియు డిజైనర్ల కీలక పాత్రను కలిగి ఉంటారు" అని వివరించారు.

గుర్తించిన 75 లక్షల మంది క్రాఫ్ట్ కళాకారుల్లో ప్రతి ఒక్కరూ ప్రతి నెలా రూ. 1000/- ఎక్కువ సంపాదించేలా చూడాలనే ఒక లక్ష్యంతో కలిసి పనిచేయాలని డిజైనర్లను మంత్రి కోరారు. భారతదేశం యొక్క క్రాఫ్ట్ మరియు వారసత్వాన్ని గుర్తించడం మరియు రక్షించడం తదుపరిది అని ఆయన అన్నారు. క్రాఫ్ట్ ఎకోసిస్టమ్‌లో మార్పు తీసుకురావడానికి 30000 మంది పూర్వ విద్యార్థులు కలిసి రావాలని ఆ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రతి పూర్వ విద్యార్థి ఒక క్రాఫ్ట్ వ్యక్తిని దత్తత తీసుకోవాలని మరియు డిజైన్, నిర్వహణ మరియు సాంకేతికత యొక్క వివిధ అంశాలపై సమాజంలోని ప్రత్యేకత లేని వర్గానికి అవగాహన కల్పించడానికి సమయాన్ని కేటాయించాలని ఆయన అన్నారు.

భారతదేశం అంతిమంగా ప్రపంచ ఫ్యాషన్ రాజధానిగా మారాలని శ్రీ గోయల్ పేర్కొన్నారు. భారతదేశం తన ఉత్పత్తులను ప్రపంచంలోని ప్రముఖ ఫ్యాషన్ హౌస్‌లతో పాటు ప్రదర్శించడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా తన ఉనికిని గుర్తించాలన్నారు. " దేశ పురోగతి కోసం సరైన ఆలోచనలను ముందుకు తీసుకెళ్లాలి. అందుకోసం వివిధ వర్గాల మధ్య సహకారం అవసరం. అందరూ కలిసి భారతీయ క్రాఫ్ట్ ఉనికిని ప్రపంచవ్యాప్తంగా అనుభూతి చెందేలా చేయవచ్చు. తద్వారా అందరూ ప్రయోజనం పొందుతారు" అని శ్రీగోయల్ అభిప్రాయ పడ్డారు.

ఈ సమావేశానికి అకాడమిక్స్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ వందనానారంగ్ మరియు హెడ్ ఆఫ్ ది ఇండస్ట్రీ అండ్ నిఫ్ట్ అలుమ్ని ప్రొఫెసర్ డాక్టర్ జోనలీ డి బాజ్‌పాయ్ కూడా హాజరయ్యారు.

# మన ఊరు - మన బడి కార్యక్రమం విజయవంతం చేయాలి....!

సంగారెడ్డి, ఫిబ్రవరి 12 (నేటి నిజం ప్రతినిధి) ప్రభుత్వ పాఠశాలలకు అన్ని హంగులను సమకూరుస్తూ విద్యా వ్యవస్థను మరింత పటిష్టపరిచేందుకు విలుగా ప్రభుత్వం చేపట్టిన మన ఊరు - మన బడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, హరీష్ రావు పిలుపునిచ్చారు.

శనివారం మంత్రులు హైదరాబాద్ నుండి రాష్ట్ర విద్యా శాఖ ఉన్నతాధికారులతో కలిసి మన ఊరు - మన బడి కార్యక్రమంపై జిల్లా కలెక్టర్లు, జెడ్పీ చైర్మన్లు,అదనపు కలెక్టర్లు, విద్యా శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

కార్పొరేట్ పాఠశాలలను తలపించే విధంగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారనున్నట్లు తెలిపారు. తొలి విడతగా మూడో వంతు పాఠశాలల్లో మన ఊరు - మన బడి కార్యక్రమం అమలు చేయాలని ప్రభుత్వం సంకల్పించిందని, దీని ద్వారా 60 శాతం పైగా విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందని మంత్రులు పేర్కొన్నారు.



ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను సమాన నిష్పత్తిలో ఎంపిక చేసి మౌలిక సదుపాయాల కల్పనను మెరుగుపర్చే పనులు జరిపించాలని సూచించారు.

అవసరమైన చోట మరమ్మతు పనులను చేపడుతూ, అదనపు తరగతి గదుల నిర్మాణాలు, లాబరేటరీ, లైబ్రరీ, ప్రహరీ గోడ, కిచెన్ షెడ్స్, డైనింగ్ హాల్, మరుగుదొడ్లు, నీటి వసతి, విద్యుత్, ఫర్నీచర్, డిజిటల్ విద్యా బోధనకు సంబంధించినవి తదితర వసులు చేపట్టాల్సి ఉంటుందన్నారు. ఏ పాఠశాలలో ఏయే సౌకర్యాలు అందుబాటులోకి తేవాల్సి ఉందన్న విషయాన్ని గుర్తించేందుకు క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ బడులను సందర్శించాలని కలెక్టర్లకు సూచించారు.

అత్యధిక విద్యార్థులు ఉన్న పాఠాశాలలను తొలి విడత జాబితాలో ఎంపిక చేయాలని సూచించారు. పాఠశాల నిర్వహణ కమిటీ ద్వారా అభివృద్ధి పనులకు నిధులు ఖర్చు చేయాలని, ఎస్ ఎం సి చైర్మన్ తో పాటు స్థానిక సర్పంచ్, ప్రధానోపాధ్యాయుడు, ఇంజినీరింగ్ విభాగం ఏ.ఈ సభ్యులుగా ఉంటారని పేర్కొన్నారు.

మన ఊరు - మన బడి కార్యక్రమంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, జడ్పి చైర్మన్లతో పాటు జెడ్ పీ టి సి లు, గ్రంథాలయాల చైర్మన్లు తదితర స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను భాగస్వాములు చేయాలని సూచించారు.

విరాళాలు అందించేందుకు ముందుకు వచ్చే ఎన్ఆర్ఐలు, పూర్వ విద్యార్థులు, ఇతర దాతలను ప్రోత్సహించాలని, వారి ఆర్థిక సహకారంతో బడులను మరింతగా అభివృద్ధి చేసుకోగల్గుతామన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ జిల్లాలో 1262 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని,(860 ప్రాథమిక పాఠశాలలు,191 ప్రాథమికోన్నత ,211 ఉన్నత పాఠశాలలు) అందులో మొదటి విడతగా మన ఊరు - మన బడి కార్యక్రమం అమలుకు 442 పాఠశాలలను గుర్తించామని తెలిపారు. అందులో 302 ప్రాథమిక, 68 ప్రాథమికోన్నత, 72 ఉన్నత పాఠశాలలను గుర్తించినట్లు తెలిపారు.

వారం రోజుల్లోపు ఎంపీలు, ఎమ్మెల్యేలతో సమావేశమై వారి భాగస్వామ్యం కోరుతామని, పనులను గ్రౌండింగ్ చేసే సమయానికి అన్ని ఏర్పాట్లతో పూర్తి స్థాయిలో సన్నద్ధమై ఉంటామని తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో సమీక్షించారు. మన ఊరు - మన బడి కార్యక్రమం అమలు కోసం ఎంపిక చేసిన పాఠశాలల్లో ఇప్పటికే అందుబాటులో ఉన్న వసతులు , ఇంకా అవసరమైన సదుపాయాలూ ఏమిటన్నవి గుర్తించి సమగ్ర వివరాలతో నివేదిక అందించాలని అధికారులకు సూచించారు.

వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా నుండి జెడ్పి చైర్ పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి, అదనపు కలెక్టర్లు రాజర్షి షా, వీరారెడ్డి, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఈఓ నాంపల్లి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

# విశ్వేశ్వరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన కూడేరు ఎంపీడీఓ



హైదరాబాద్, ఫిబ్రవరి 12: కూడేరు ఎంపీడీఓ యాదవేంద్ర , ఉరవకొండ నియోజకవర్గ ఇంచార్జ్ ,మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డిని మర్యాద పూర్వకంగా ఆయన నివాసంలో కలిశారు. శుక్రవారం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో ఆయనను కలిసారు. మాజీ ఎమ్మెల్యేకు పుష్పగుచ్చం అందజేశారు. తమ మీద నమ్మకం ఉంచి పోస్టింగ్ ఇప్పించినందుకు కృతజ్ఞతలు తెలియజేసారు. అనంతరం ఆయనతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. కూడేరు మండల ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల ముందుకు తీసుకు వెళ్లి ప్రజల సమస్యలను రాజకీయ పార్టీలకు అతీతంగా ముందుకెళ్ళాలని కోరారు. ప్రజా సమస్యలు పరిష్కారంలో ఎటువంటి ఇబ్బందులు వున్నా, తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో కూడేరు ఎంపీపీ నారాయణరెడ్డి, జడ్పిటిసి భర్త అశ్విని హరీష్, వైస్సార్సీపీ జిల్లా నాయకులు వసికెరీ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# పైలెట్లు లేకుండానే ఎగిరిన హెలికాప్టర్..




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:అమెరికాలోని కెంటకీలో ఓ బ్లాక్ హాక్ హెలికాప్టర్ పైలెట్ లేకుండానే ప్రయాణించింది. దేశ ఆర్మీ అధికారులు పైలెట్ లేకుండా వెళ్లగలిగే అటానమస్ 'బ్లాక్ హాక్' హెలికాప్టర్ ను టెస్ట్ చేశారు. ఈ ఛాపర్ 30 నిమిషాల ప్రయాణించి సురక్షితంగా ల్యాండింగ్ అయింది. సిమ్యులేషన్ పద్ధతిలో ఏర్పాటు చేసిన ఊహాజనిత సిటీలోని బిల్డింగులను దాటేస్తూ ముందుకెళ్లింది. గంటకు 190 కిలోమీటర్ల నుంచి 250 కిలోమీటర్ల వేగంతో 4 వేల అడుగుల ఎత్తులో ఎగిరింది. రెట్రోఫిట్ చేయబడిన వర్లీబర్డ్ సికోర్స్కీ-నిర్మిత స్వయంప్రతిపత్తి వ్యవస్థ ద్వారా నియంత్రించబడుతుంది. బ్లాక్ హాక్‌ను పైలట్ లేకుండా గాలిలోకి పంపడం ఇదే మొదటిసారి. కాగా, జూ మిలిటరీ ఐకాన్ అయిన బ్లాక్ హాక్ హెలికాప్టర్ ఈ వారం ప్రారంభంలో కెంటుకీలో మొదటిసారిగా పైలట్ లేకుండా ప్రయాణించింది.

# ప్రధానిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం కాదు - పొంగులేటి సుధాకర్ రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 12:భారత దేశ ప్రధాని నరేంద్ర మోడీ పై, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకులు, తమిళనాడు రాష్ట్ర సహ ఇంచార్జ్ పొంగులేటి సుధాకర్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి భాషా సంస్కారం లేకుండా, దేశ ప్రధానిని భారతదేశం నుండి తరిమికొడతామని అనడం హాస్యాస్పదంగా ఉందని, రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రిగా ఇచ్చినటువంటి హామీలను నెరవేర్చాలని భారతీయ జనతా పార్టీతో కలిసి ఆందోళన చేస్తున్నటువంటి నేపథ్యంలో తెలంగాణ ప్రజల యొక్క దృష్టి మరల్చేందుకు ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారని పొంగులేటి సుధాకర్ రెడ్డి అన్నారు, ఇప్పటికైనా నిరుద్యోగ భృతిని వెంటనే విడుదల చేయాలని, అర్హులైన పేద వారందరికీ డబల్ బెడ్రూమ్ ఇల్లు వెంటనే మంజూరు చేయాలని, దళితులకు 3 ఎకరాల భూమి ఇవ్వాలని, గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, రేషన్ కార్డులు లేక అనేకమంది పేదలు ఇబ్బందులకు గురవుతున్నారని వారికి వెంటనే కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని, వృద్ధులకు వితంతువులకు దివ్యాంగులకు వెంటనే నూతన పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధిని ప్రజాసంక్షేమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి పక్కనపెట్టి ఫామ్ హౌస్ కే పరిమితమయ్యారని అన్నారు, మోడీపై దేశ ప్రజలకు పూర్తి విశ్వాసం ఉందని, కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ బిజెపి ప్రభుత్వం దేశంలోని పేద మహిళలందరికీ ఈ సంవత్సరం నూతనంగా కోటి మంది మహిళలకు ఉజ్వల పథకం ద్వారా ఉచితంగా గ్యాస్ సిలిండర్లు ఇవ్వబోతున్నారని, 80 లక్షల మంది నిరుపేదలకు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ఇల్లు నిర్మించబోతున్నారు అని, దేశవ్యాప్తంగా ఫోర్ వే రోడ్ల నిర్మాణం చేస్తున్నారని, స్వచ్ఛభారత్ కింద మరుగుదొడ్లు నిర్మించి ఇస్తున్నారని, ఎస్సీ ఎస్టీ పేదలకు స్టార్ట్ అప్ ఇండియా స్టాండప్ ఇండియా పేరుతో పారిశ్రామికవేత్తలను చేస్తున్నారని, దేశ రక్షణ రంగానికి కోట్ల రూపాయలు వెచ్చించి మిలటరీకి అత్యాధునిక ఆయుధాలు సమకూర్చి దేశ రక్షణ పటిష్ట పరుస్తున్నారు అని, అన్నారు, అభివృద్ధి సంక్షేమ విషయంలో ప్రియతమ ప్రధాని నరేంద్ర మోడీ గారి కృషి ఎనలేనిదని, అటువంటి దేశ ప్రధాని పై అనుచిత వ్యాఖ్యలు చేయడం కంటే రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టడం మంచిదని కేసీఆర్ కి హితవు పలికారు.


సృజన ప్రియ | సృజన నేడు
ప్రజల పక్షాన అక్షర సమరం

రజతోత్సవం సందర్భంగా కథలు, కవితల పోటీ

ఉత్తమ రచనలకు ఇదే మా ఆహ్వానం

'సృజనప్రియ'
మీ అందరి ఆదరాభిమానాలతో 25 వసంతాలు పూర్తి చేసుకుని రజతోత్సవ వేడుకలకు సమాయత్తమవుతున్న శుభతరుణమిది. ఈ సందర్భంగా ప్రత్యేక విశేష సంచికను తీసుకువస్తున్నాం. పాఠకుల ఆదరాభిమానాలతో విజయవంతంగా దూసుకెళ్తున్న మన పత్రిక పట్ల మీరు చూపుతున్న ఆదరణ మమ్మల్ని మంత్రముగ్ధుల్ని చేస్తోంది.

రోజ్ పబ్లికేషన్స్ ద్వారా 'సృజనప్రియ' మాసపత్రిక స్థాపించి 25 సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా కథ, కవితల పోటీలు నిర్వహిస్తున్నాం. కథ/కవిత ఇతివృత్తం వర్తమాన సామాజిక పరిస్థితులను ప్రతిబింబించేదై వుండాలి. కథ, కవిత తప్పులు లేకుండా కాగితానికి ఒకవైపు మాత్రమే డి.టి.పి. చేసిన నాలుగు పేజీల కథ, ముప్పయి వరుసలు మించని ఉత్తమ కవితలకు ఆహ్వానం పలుకుతున్నాం. వస్తువు ఎంపికలో కవికి/కథకునికి పూర్తి స్వేచ్ఛ ఉంటుంది. తమ కథ/కవిత ఎక్కడా ప్రచురితం కాలేదని బ్లాగుల్లో వెబ్ మేగజైన్లలో కూడా రాలేదని,ఎక్కడా ప్రచురణకు గాని,ప్రసారార్థం కు గాని పరిశీలనలో లేదని హామీపత్రంలో రాయాలి.హామీ పత్రం జతచేయని కథ/కవిత పోటీకి పరిగణించబడవు.హామీపత్రంలోనే తమ చిరునామా ఫోన్ నెంబర్ రాయాలి. కథ/కవిత పేజీలపై ఎక్కడా పేరు,చిరునామా, ఫోన్ నెంబరు రాయకూడదు.

కథ మొదటి బహుమతి రూ.5000,
రెండవ బహుమతి రూ.3000
మూడవ బహుమతి రూ.2000
కన్సోలేషన్ బహుమతులు ఐదు. ఒక్కొక్కటి రూ.1000

కవిత మొదటి బహుమతి రూ.3000,
రెండవ బహుమతి రూ.2000
మూడవ బహుమతి రూ.1000.
ప్రత్యేక బహుమతులు ఐదు.ఒక్కొక్కటి రూ.500

పోటీ గడువు పొడిగించేందుకు కానీ అర్హమైన కథలు/కవితలు రాకపోతే బహుమతుల్లో మార్పులు చేర్పులు చేసే వీలు 'రోజ్ పబ్లికేషన్స్' యాజమాన్యానికి ఉంటుంది. కథ/కవిత ఎంపిక విషయంలో సంపాదక వర్గానిదే తుది నిర్ణయం. ఈ విషయంలో ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలు, వాదోపవాదాలు జరుపబడవు. పోటీకి, ప్రచురణకి అనర్హమైన కథలు/కవితలు తిప్పి పంపుట సాధ్యం కాదు. కావున యాజమాన్యంతో సహకరించగలరు. బహుమతి పొందని కథలను/కవితలను సాధారణ ప్రచురణగా సృజనప్రియ మాస పత్రిక/సృజననేడు దినపత్రిక సాహిత్య పేజీలో వేయు అధికారము యాజమాన్యానికి కలదు. కథ/కవిత ఒక్కొక్కటి మూడు కాపీలు స్పీడ్ పోస్ట్/రిజిస్టర్ పోస్ట్/డి టి డి సి కొరియర్ లో మాత్రమే పంపాలి. సాధారణ పోస్టులో పంపే రచనలు మాకు చేరకపోతే మేము బాధ్యత వహించము.
బహుమతులు గెలుచుకున్న రచయితలకు/ కవులకు నగదు బహుమతితో పాటు రజతోత్సవ వేడుకలలో ప్రముఖుల సమక్షంలో సత్కారం ఉంటుంది.రజతోత్సవ వేడుకలు ఏప్రిల్/మే నెలలో ఉండవచ్చు. బహుమతి పొందిన కవులు/రచయితలు రజతోత్సవ వేడుకలకు హాజరై బహుమతులు అందుకోవలసి ఉంటుంది.

కథలు/కవితలు పంపవలసిన చిరునామా :
కొమ్మవరపు విల్సన్ రావు, ఇం. నెం.5-2-396/ SS /P42
జక్కిడి రాంరెడ్డి కాలనీ, సాహెబ్ నగర్ కలాన్
వనస్థలిపురం,హైదరాబాద్-500 070
ఫోన్ నంబర్: 89 85 43 55 15
ఇతర వివరాలకు పైన తెలిపిన ఫోన్ నంబర్ లో సంప్రదించవచ్చును.

కథ/కవిత
చేరవలసిన ఆఖరి తేదీ:
మార్చ్ 15, 2022.

నీలం దయానంద రాజు
చీఫ్ ఎడిటర్, సృజనప్రియ మాసపత్రిక, సృజననేడు దినపత్రిక

